21 . 2. 2026

# వెలుతురు

VELTHURU TELUGU DAILY

శనివారం | రంగారెడ్డి, నల్లగొండ

సంపుటి :07 సంచిక : 257 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

- డిపిఆర్వోలను ఆదేశించిన స్పెషల్ కమిషనర్

**హైదరాబాద్,ఫిబ్రవరి 20 వెలుతురు:**



జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డి.పి.ఆర్.ఓ.లను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక ఆదేశించారు. శుక్రవారంనాడు



# సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

- మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఏఐ
- ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి
- హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం
- ఏఐ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలి

### ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో సీఎం రేవంత్ రెడ్డి

*గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్శిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు.*

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 వెలుతురు:**
మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేథస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చు కోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు

## ఏలియన్స్ గుట్టు బయటపెడతాం



- వాటికి సంబంధించిన ఫైళ్లను వెల్లడిస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,ఫిబ్రవరి 20 వెలుతురు:**
అమెరికాలో ఏలియన్స్, యూఎఫ్ఓ లకు సంబంధించిన ప్రభుత్వ ఫైళ్లను విడుదల చేసే పక్రియను ప్రారంభించాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువులకు

## స్మగ్లర్ల ఆగడాలు అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ సిబ్బందికి ఆయుధాలు


- ప్రభుత్వం పరిశీలిస్తోందన్న మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఫిబ్రవరి20 వెలుతురు:**
స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్



## కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డకి అస్వస్థత

- హుటాహుటిన హైదరాబాద్ నిమ్స్‌కు తరలింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి20 వెలుతురు:**
కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడు తుండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, జీవన్ రెడ్డి ఇటీవల కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. బీఆర్ఎస్

## డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

- తెలంగాణ రైజింగ్'లో ట్రాన్స్ ఫార్మేషన్ టూల్ గా టెక్నాలజీ
- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ స్ సామాన్యుడికి చేరువ చేయాలన్న తపన
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 వెలుతురు:**
ఎఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను సామాన్యుడికి చేరువ చేసి... డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో టెక్నాలజీని కేవలం ఓ సాఫ్ట్వేర్ గా మాత్రమే



కాకుండా... ఓ ట్రాన్స్ ఫార్మేషన్ టూల్ గా మార్చుకుంటున్నామన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రణాళికలను న్యూఢిల్లీ భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా శుక్రవారం 'ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్; ఏఐ ఫర్ గవర్నమెంట్ సర్వీసెస్ అండ్ క్లైమేట్ రెసిలియెన్స్' అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. పౌర సేవలకు టెక్నాలజీని అనుసంధానం చేసి... ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఉండే దూరాన్ని తగ్గించేందుకు చిత్తశుద్ధితో కృషి

## జీవన్ రెడ్డి మర్యాదకు భంగం కలిగించకండి

- కాంగ్రెస్ అధిష్టానానికి జగ్గారెడ్డి వినతి

**హైదరాబాద్,ఫిబ్రవరి 20 వెలుతురు:**



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ కష్ట కాలంలో పార్టీతో ఉన్న జీవన్ రెడ్డికి గౌరవం ఇచ్చే విధంగా పార్టీ హైకమాండ్ చొరవ తీసుకోవాలని

## బెంగాల్ సర్ ప్రక్రియ ప్రహసనం

- పరస్పర విమర్శలు సాగడంపై దురదృష్టకరం
- వివాదాల పరిష్కారానికి జ్యుడిషియల్ అధికారుల నియామకం
- హైకోర్టుకు ఓటర్ల జాబితాల సవరణ పక్రియ పర్యవేక్షణ
- సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన నిర్ణయం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 వెలుతురు:**
ఓటర్ రోల్ క్లీన్-అప్ డ్రైవ్ విషయంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మధ్య పరసర్ప నిందారోణపలు చోటుచేసుకోవడం, ఎస్ఐఆర్ పక్రియపై సంక్లిష్ట పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు

## ఎప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

- జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు




**హైదరాబాద్,ఫిబ్రవరి 20( వెలుతురు):**
ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ఎస్ఐఆ÷-కు సంబంధించి

## ఆయిల్ పామ్ సాగుతో తెలంగాణ రైతాంగానికి మహర్దశ

- ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లో సాగుకు రూ.456 కోట్లు కేటాయింపు
- పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలి
- దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలి
- కామారెడ్డి జిల్లాలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో మంత్రి తుమ్మల



**కామారడ్డి,ఫిబ్రవరి 20 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుతో రైతాంగానికి మహర్దశ పట్టనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పాల్వంచమర్రి గ్రామంలో ఉద్యాన ,పట్టు పరిశ్రమ శాఖతో పాటు హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సింగిరెడ్డి బలరాం ఆరున్నర ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలిక

## భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్‌పై చర్చిస్తారు

- కంప్యూటింగ్ పరికరాలకు క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన
- డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా దృష్టి
- స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి పారిశ్రామిక క్లస్టర్లు
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- పలు సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్న ఎపి ప్రభుత్వం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20 వెలుతురు:**
అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు సమీప భవిష్యత్‌లో వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడిటెక్ పార్క్‌లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని వివరించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటమ్ - ఏఐ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా తమ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు.. క్వాంటం ఎకో సిస్టంను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం



## హామీల అమలుకు తగ్గట్లుగా బడ్జెట్

- వాస్తవాలకు దగ్గరగా నిధుల కేటాయింపు
- అధికారంలోకి వచ్చి 800 రోజులైనా దిక్కులేదు
- ఎన్నికల ముందు రాసిచ్చిన బాండ్ పేపర్ల గతేమయ్యింది
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**సిద్దిపేట,ఫిబ్రవరి20 వెలుతురు:**
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్‌ను తయారు చేయాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో

## స్మగ్లర్ల ఆగడాలు అరికట్టేందుకుఎక్సైజ్ శాఖ సిబ్బందికి ఆయుధాలు

అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణెళి లక్ష్యం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డి మర్యాదకు భంగం కలిగించకండి

జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.జగ్గారెడ్డి తాజాగా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా నా వ్యక్తిగత అభిప్రాయాన్ని రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు మీడియా ద్వారా తెలియజేస్తున్నా. జీవన్ రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయారు. కాంగ్రెస్ పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పార్టీలోనే ఉన్నాడు. రాజకీయంగా జీవన్ రెడ్డికి ఎన్నో ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌తోనే ఉన్నారు. కష్ట కాలంలో పార్టీలో ఉన్న జీవన్ రెడ్డికి అవమానం జరగకుండా కాంగ్రెస్ పెద్దలు చొరవ చూపాలి. జీవన్ రెడ్డికి గౌరవం వచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారిని కోరుతున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో, జీవన్‌రెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఫుడ్ పాయిజన్ అయిందని జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నట్టు సమాచారం.

## కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డకి అస్వస్థత

నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్, జీవన్ రెడ్డి మధ్య వర్గపోరు కొనసాగుతోంది.ఒక దశలో పార్టీని కూడా వీడుతానని జీవన్ రెడ్డి అలకబూనడంతో అధిష్ఠానం బుజ్జగింపులతో వెనక్కి తగ్గారు. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సైతం తన వర్గం అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్నాడు. సీనియర్ అయిన తనను సరిగా గౌరవం ఇవ్వడం లేదని అసృంతృప్తికి లోనవుతున్నాడు. జీవన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

నాంపల్లిలోని తెలగాంణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ పక్రియ విధి విధానాలపై డి.పి.ఆర్.ఓ.లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జి.ఓ. నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పి.ఆర్.ఓ.లకు సూచించారు. జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రిలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల పక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులను ఆస్కారం లేకుండా అక్రిడిటేషన్ పక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డి.పి.ఆర్.ఓ.లను ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డి.పి.ఆర్.ఓ.లు, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డి.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.

## ఎప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్‌ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు.÷ూబోయే ఎస్‌ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్‌ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. న్నికల పక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

## ఏలియన్స్ గుట్టు బయటపెడతాం

సంబంధించిన రహస్య ఫైళ్లను గుర్తించి.. వాటిని బహిర్గతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రంప్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో గ్రహాంతర వాసుల ఉనికిపై దశాబ్ద కాలంగా సాగుతున్న అమెరికన్ల ఉత్కంఠకు తెరపడనుంది. ప్రజల్లో ఈ రహస్యాల పట్ల ఉన్న ఆసక్తిని తీర్చాలని భావించే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తన ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పేర్కొన్నారు. యూఎస్ మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా.. గ్రహాంతరవాసులు ఉన్నారని ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించడంతో ఈ వివాదం రాజుకుంది. దీనిపై ఒబామా నాడు మాట్లాడుతూ.. 'గ్రహాంతర వాసులు ఉన్నది నిజమే కావచ్చు. కానీ నేనెప్పుడూ వారిని చూడలేదు' అని అన్నారు. అమెరికాలోని ఏరియా 51లో వారిని దాచిపెట్టారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవమూ లేదని ఆయన వ్యాఖ్యానించారు. తన పదవీ కాలంలో ఏలియన్స్ భూమిపై సంచరించినట్టు ఎలాంటి ఆధారాలూ లభించలేదని స్పష్టం చేశారు. అయితే.. ఈ సమాచారాన్ని ఒబామా బహిర్గతం చేయడాన్ని తప్పుబట్టారు ట్రంప్. క్లాస్గి÷డ్ సమాచారాన్ని బయటపెట్టి ఒబామా పెద్ద తప్పుచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరల్ అయిన ఒబామా 'ఏరియా 51' వ్యాఖ్యలను ట్రంప్ ఉదహరిస్తూ.. 'ఏలియన్స్‌లో ఎవరున్నారో నిజంగా నాకు తెలియదు. కానీ ప్రభుత్వం వద్దనున్న సమాచారాన్ని మాత్రం బయటపెడతాను' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. గ్రహాంతర సాంకేతికతకు సంబంధించి తమ వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని 2024 మార్చిలో పెంటగాన్ ఓ నివేదికలో పేర్కొంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం.. వాటికి సంబంధించిన సమాచారమేమీ లేదని.. ఆకాశంలో కనిపించిన వింత వస్తువులు సహజమైనవి కావచ్చని స్పష్టం చేసింది. కానీ దీనిపై ఇప్పుడు ట్రంప్ సెక్రటరీ ఆఫ్ వార్ సహా ఇతర ఏజెన్సీ సంస్థలను రంగంలోకి దింపి ఈ రహస్య పక్రియను ఛేదించేందుకు యత్నించడం చర్చనీయాంశమైంది. అయితే.. ఈ రహస్య పత్రాలను ప్రజల ముందుకు తీసుకువస్తారా లేదా అనే విషయమై ఎలాంటి స్పష్టతనివ్వలేదు ట్రంప్. ఈ ్గ÷ళ్లైలో అత్యంత సంక్లిష్టమైన, ఆసక్తికరమైన, ముఖ్యమైన విషయాలకు సంబంధించిన సమాచారం ఏది ఉన్నా బహిర్గతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏది ఏమైనా ట్రంప్ తాజా నిర్ణయంతో.. అంతరిక్షంలో ఉన్న ఇతర జీవుల ఉనికిపై అమెరికా ప్రభుత్వ అధికారిక వైఖరి ఏంటనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో ఎన్నో ఖగోళ విషయాలు బయటకు వస్తాయని, చాలా మందికి అంతుచిక్కని ప్రశ్నలకు సమాధానం లభించనుందని శాస్త్రవేత్తల్లో ఆసక్తి నెలకొంది.

# సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు.

ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో



ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశర చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# డిజిటల్ గవర్నెన్స్ లో రోల్ మోడల్ గా తెలంగాణ

చేస్తున్నామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఐకం, ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, భూ భారతి లాంటి విప్లవాత్మక సంస్కరణలు డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణ బ్రాండ్ ను సుస్థిరం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ఫలాలను కేవలం ఓ ప్రాంతానికో లేదా వర్గానికో పరిమితం చేయకుండా అందరికీ చేరువ చేసేలా 'ఏజెంటిక్ ఏఐ' వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. టెక్నాలజీని కేవలం గవర్నెన్స్ కు మాత్రమే పరిమితం చేయకుండా వ్యవసాయం, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, సుస్థిర నగరాల అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ, డిజాస్టర్ మేనేజ్ మెంట్ తదితర రంగాలకూ విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణా అవకాశాల గని.. అపారమైన టాలెంట్ పూల్ మా బలం అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణాలో ఏఐ పరిశోధలు, ఆవిష్కరణలకు ప్రభావశీలమైన టాలెంట్ పూల్ ఉందని తెలిపారు. ఏఐ సమ్మిట్ లో స్వీడెన్ వాణిజ్య ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.కృత్రిమ మేథ వెల్లువ వల్ల ఎదురయ్యే సవాళ్లను, అది తీసుకువచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రభుత్వం ముందే సంసిద్ధమైంది. దానికి తగ్గట్టుగా సాఫ్ట్ వేర్ నిపుణుల నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు ప్రారంభించాం. ఇదిలావుంటే ఏఐ విస్తృతితో ఉద్యోగ విధుల్లో గణనీయమైన మార్పులు వస్తాయి. అందుకు అవసరమైన సన్నధను మొదలు పెట్టింది మా ప్రభుత్వమే.ఏఐ పరిశోధన కేంద్రాలు, అప్లికేషన్లు, సేవల వల్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. యువత దీనిని అందిపుచ్చుకోవాలి.యువత, వృత్తి నిపుణులు మరింత సృజనాత్మక బాధ్యతలు చేపట్టేందుకు ఏఐ అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది.స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ అనేది రెండేళ్లుగా మేం మంత్రంలా జపిస్తున్నాం.ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఏఐ వినియోగం వల్ల లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెరుగుతుంది. దుర్వినియోగానికి ద్వారాలను మూసివేస్తుంది.

ఇందుకు అవసరమైన అప్లికేషన్లను రూపొందించడం, నూతన ఆవిష్కరణలను చేపట్టేందుకు గ్లోబల్ టెక్ కంపెనీలు ముందుకు రావాలని అన్నారు. కృత్రిమ మేథ ఫలాలను ప్రజలందరి వద్దకు చేర్చేందుకు ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించే బృహత్తర యజ్ఞం ఇప్పటికే మొదలైంది. టీ-్గ÷బైర్ ప్రతి గ్రామాన్ని ప్రంపచంతో కనెక్ట్ చేసేందుకు రెండేళ్లుగా శ్రమిస్తోంది. ఏఐ ఓ గేమ్ ఛేంజర్. దాన్ని మచ్చిక చేసుకోవాలి. మన నైపుణ్యాలకు పదును పెట్టుకుని దానిని నియంత్రణలోకి తెచ్చుకోవాలి. పెట్టుబడులకు తెలంగాణా స్వర్గధామం లాంటిది. కొత్తదనానికి రాష్ట్రం ఎప్పుడూ స్వాగతం పలుకుతూ ఉంటోంది.దీనికి అనుకూలమైన ఎకోసిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేశాం. నిరంతర విద్యుత్తు సరఫరా, స్థిరమైన విధానాలు అమలు చేస్తున్నాం అని వివరించారు.

# ఆయిల్ పామ్ సాగుతో తెలంగాణ రైతాంగానికి మహర్దశ

లాభాలను అందిస్తుందని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఈ పంట రైతుల కుటుంబాలను ఆర్థికంగా బలపరుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.88 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉన్నదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు 32,923 మంది రైతులు 1,05,455 ఎకరాల్లో ఈ పంట సాగును చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రూ.456 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తుండగా, సిద్దిపేట జిల్లా నర్మేట్టలో నిర్మాణం పూర్తయిన ఫ్యాక్టరీ త్వరలో అందుబాటులోకి రానుందని మంత్రి చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలను సాగు చేస్తూ రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పంట నాలుగు సంవత్సరాల్లో దిగుబడిని ఇవ్వడం ప్రారంభించి 30 నుంచి 40 సంవత్సరాల పాటు ఆదాయం అందిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా అంతరపంటల ద్వారా కూడా అధిక లాభాలను పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టాలనుకునే రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, డ్రిప్ సౌకర్యాలను ప్రభుత్వం రాయితీ మీద అందిస్తుందని, రైతుకు ఎకరాకు రూ.51,000 సబ్సిడీ రూపంలో అందచేయడం జరుగుతున్నదని, అందుబాటులో ఉన్న ఈ అవకాశాలను వినియోగించుకుని రైతులు పెద్దఎత్తున ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని మంత్రి సూచించారు. కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ పంట ద్వారా ఎకరానికి సంవత్సరానికి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని, మార్కెట్ సమస్యలు లేకుండా సాగు చేయగల పంట ఇదేనని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల మాదిరిగా కామారెడ్డి జిల్లా కూడా ఆయిల్ పామ్ సాగులో ముందంజలో నిలవాలని సూచించారు.

హిందుస్థాన్ యూనిలీవర్ ప్రతినిధి వరుణ్ మెహత మాట్లాడుతూ కంపెనీ తరపున సాగు, మార్కెటింగ్‌కు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. డ్రిప్ సౌకర్యానికి అదనంగా కంపెనీ ద్వారా రూ.5,000 ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ మదన్ మోహన్, ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్, సర్పంచ్ శేకర్ తదితరులు పాల్గొన్నారు. హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ప్రతినిధులు వి÷-లలెం యూజెన్, యోగేష్ మిశ్రా, విపుల్ పాటిల్, వరుణ్ మెహత, సుందర్ మహాజన్, రతీష్ మాత్యు, విజయ రంగస్వామి కూడా హాజరయ్యారు.

# బెంగాల్ సర్ ప్రక్రియ ప్రహసనం

శుక్రవారంనాడు సంచలన నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాల సవరణపై దురదృష్టకరమైన విమర్శల ఆట కొనసాగుతోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఓటర్ల జాబితాల సవరణ పక్రియను పర్యవేక్షించేందుకు న్యాయాధికారులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఎస్‌ఐఆర్‌లో అభ్యంతరాలు, వివాదాలను జ్యుడిషియల్ ఆఫీసర్లు పరిష్కరిస్తారని పేర్కొంది. రాజ్యాంగ బద్ధ వ్యవస్థలైన రాష్ట్రం, ఎన్నికల కమిషన్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నడుస్తోంది. దీంతో ఎస్‌ఐఆర్ పక్రియ అభ్యంతరాలు, వివాదాల మధ్య చిక్కుకుంది' అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఎస్‌ఐఆర్ కోసం పనిచేస్తున్న జిల్లా జడ్జి హోదాలో ఉన్న మాజీ న్యాయాధికారులను కూడా ఈ పక్రియ కోసం నియమించాలని, అసాధారణ పరిస్థితుల కారణంగా అసాధారణ ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయాధికారుల నియామకం, బాధ్యతలకు సంబంధించి సమగ్ర ప్లాన్ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో శనివారంనాడు సమావేశం కావాలని ఎన్నికల కమిషనర్, చీఫ్ సెక్రటరీ, పోలీస్ చీఫ్, ఇతర ఉన్నతాధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. జ్యుడిషియల్ ఆఫీసర్లు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు వేసింది. 'రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆశించాం. అయితే కమ్యూనికేషన్ విషయంలో వ్యవహరించే తీరు ఇదేనా? ఫిబ్రవరి 9వ తేదీ ఆదేశాలకు ఫిబ్రవరి 17న స్పందించారు. 8,500 ఆఫీసర్లను పంపామంటారు. మేము మైక్రో అబ్జర్వర్లం కాదు. ఈ వ్యవహారం మాకు తీవ్ర అంసతృప్తిని కలిగిస్తోంది. రాష్ట్రాలు సహకరిస్తాయని మేము భావిస్తాం. మాకు ప్రైవేటు వివరణలు అవసరం లేదని సీజేఐ అన్నారు. ఎస్‌ఐఆర్‌పై జరుపుతున్న పోరాటాన్ని ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఇటీవల ఢిల్లీకి తీసుకువెళ్లారు. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులతో సమావేశానంతరం బహిరంగంగానే ఆమె హెచ్చరికలు చేశారు. ఎన్నికల కమిషన్ ముందు లక్షలాది మంది బాధితులను పెరేడ్ చేయిస్తామన్నారు. మమతా బెనర్జీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఈసీ మండిపడింది. ఎన్నికల అధికారులు ఎంతో సంయమనంతో గౌరవంతో ఆమెతో మాట్లాడినట్టు తెలిపింది. అయితే బెంగాల్ ఓటర్ల జాబితా క్లీనప్ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి మినహాయించారని మమతా బెనర్జి ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన అస్సాంలో ఎందుకు ఎస్‌ఐఆర్ పక్రియ నిర్వహించలేదని నిలదీశారు. ఎన్నికల సంఘం బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని తప్పుపట్టారు.

# భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్‌పై చర్చిస్తారు

నిర్వహిస్తున్న కృత్రిమ మేథస్సు ద్వారా పోటీతత్వం అంశంపై జరుగుతున్న రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరై.. తన అభిప్రాయాలను పంచుకు న్నారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి పాల్గొన్నారు. సమీప భవిష్యత్‌లో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా మాట్లాడే రోజు వస్తుందని చెప్పుకొచ్చారు. గూగుల్ లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారుతుందని తెలిపారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టం రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారని.. దేశం దాన్ని సాధించి తీరుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని చెప్పుకొచ్చారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రభుత్వ పరంగా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా ఏపీ దృష్టి సారిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో క్వాంటమ్ - ఏఐ రంగాల్లో నైపుణ్యాభి వృద్ధి, మౌళిక వసతుల అభివృద్ధి కల్పించే దిశగా ఏడు ఒప్పందాలు కుదర్చుకుంది సర్కార్. ఏపీని క్వాంటమ్ - ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం... అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ - క్వాంటమ్ రంగాల్లో శిక్షణ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ - క్వాంటమ్ వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. క్వాంటమ్, ఏఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు యూనైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదర్చుకుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి ఏఐ క్వాంటమ్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ.ఏఐ - క్వాంటమ్ డిజిటల్ ఎంబసీగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను తీర్చిదిద్దేలా ప్రణాళికలు. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం కార్యక్రమానికి యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్ సహా ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.

# ఎన్ఎస్టీఐ హైదరాబాద్‌లో ఫర్నిచర్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్ 9వ బ్యాచ్ విద్యార్థుల కన్వొకేషన్

**హైదరాబాద్, వెలుతురు ఫిబ్రవరి 20, 2026:**

విద్యానగర్‌లోని ఎఫ్ఎఫ్ఎస్సీఎన్ఎస్టీఐ ప్రాంగణంలో ఫర్నిచర్ అండ్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్ (FFSC) ఆధ్వర్యంలో మల్టీపర్పస్ అసిస్టెంట్ ఫర్నిచర్ ప్రొడక్షన్ అండ్ ఇన్‌స్టాలేషన్ (NSQF లెవల్3, FFS Q0901) కోర్సు పూర్తి చేసిన 9వ బ్యాచ్ విద్యార్థుల కన్వొకేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం, భద్రాచలం జిల్లాల గిరిజన గ్రామాల నుంచి జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ ప్రోత్సాహంతో శిక్షణ పొందిన తొమ్మిది మంది అభ్యర్థులు అంచనాలు విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఇతర శిక్షణార్థులతో కలిసి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రాజ్యసభ సభ్యులు శ్రీ ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. నిరుద్యోగ యువతను గుర్తించి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడం ద్వారా సాధారణ ప్రజలకు ఎఫ్ఎఫ్ఎస్సీ ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించిన సంస్థలను ఆయన అభినందించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎం/స్ గ్రీన్ ప్యానెల్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఫర్నిచర్, ఇంటీరియర్ రంగంలో నైపుణ్యాభివృద్ధికి సహకరిస్తున్నదని తెలిపారు. ఎన్ఎస్టీఐ (విమెన్) ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రియా ఎస్ అతిథులను స్వాగతించారు. ఇప్పటివరకు తొమ్మిది బ్యాచ్‌లలో సుమారు 200 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. అందులో 20 మంది మహిళలు ఫర్నిచర్ ప్రొడక్షన్ శిక్షణ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు పొందినట్లు పేర్కొన్నారు.ఈ 20 మంది శిక్షణార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఎం/స్ ా‌చీదీ ఇంటీరియర్స్ అండ్ ఎక్స్‌టీరియర్స్, కాంఫోస్, క్రిస్మ మాడ్యులర్స్, అరని వుడ్, మాడ్యూలక్స్ ఇంటీరియో, అరనివుడ్ సంస్థల నుంచి అప్రెంటిస్‌షిప్ ఆఫర్ లెటర్లు అందాయి. వారికి నెలకు రూ.15,000 నుంచి రూ.18,000 వరకు స్టైపెండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారతదేశానికి చారిత్రకంగా ఉన్న నైపుణ్య సంపదను గుర్తు చేసిన శ్రీ కృష్ణయ్య, ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలపై కూడా యువత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎఫ్ఎఫ్ఎస్సీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆధునిక యంత్రాలతో అందిస్తున్న శిక్షణను ఆయన ప్రశంసించారు.







# హామీల అమలుకు తగ్గట్లుగా బడ్జెట్

బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియా, రాహుల్ రాసిచ్చిన బాండ్ పేపర్లు ఏమాయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 800 రోజులైనా ఒక్క హామీకి దిక్కులేదని, గెలిచిన నెలకే వృద్ధులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ. 4000 పెన్షన్ అన్నారు. 27 నెలలైనా రాలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నిధులు పెడతారా, లేదా? అంటూ ప్రశ్నించారు. నెలకు రూ. 2500 ఇస్తామని ఆశచూపి మహిళల ఓట్లు దండుకున్నారు. ఒక్కరికైనా రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. వెంటనే బ్జడెట్‌లో మహిళలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఎగ్గొట్టారని, రాజీవ్ యువ వికాసం అంతా బూటకమని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన ఎస్సీ, బీసీ, రైతు డిక్లరేషన్లన్నీ ఉత్త మాటలే. అసెంబ్లీలో మాయ మాటలు మాని, వాస్తవ బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకిచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10వేలు, ఇంటర్ పాస్ అయితే రూ. 25 వేలు, డిగ్రీకి రూ. 50వేలు, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి, ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20 వేలు కోట్ల బ్జడెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపిందని విమర్శించారు . వరంగల్ సభలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ అని చెప్పి మాయమాటలు చెప్పారని, ఏటా రూ. 15వేలు రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందని పేర్కొన్నారు. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు చేయగా కాంగ్రెస్ రూ. 4వేలు ఇస్తామని హామీ ఇప్పటి వరకు నెరవేర లేదని అన్నారు. ఈనెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత , చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4వేలు పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్జడెట్‌లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌నైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని, రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా బ్జడెట్‌లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

**- బాగ్ లింగంపల్లి గోదాములో ఆకస్మిక తనిఖీ**



**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):**

పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్–ఆఫిషియో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ÷ూదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్?అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ÷రిళిదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ గారు వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.'ప్రజల విశ్వాసమే మా బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలి. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించమని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ - 2025 సెకండ్ ఎడిషన్ ప్రారంభం

**- గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభించిన మంత్రి శ్రీహరి**

**- క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో సాగుతున్నామని వెల్లడి**









**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):**

సీఎం కప్ – 2025 సెకండ్ ఎడిషన్ అట్టహాసంగా ప్రారంభంఅయ్యింది. మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి, క్రీడా శాఖ అధికారులు ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి వివిధ స్కూల్స్, కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థుల మార్చ్ తో మంత్రి వాకిటి శ్రీహరి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా లేజర్ షో, శివమణి ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సీఎం కప్ 2025 సెకండ్ ఎడిషన్ ను ప్రారంభిస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చారన్నారు. ఆటల్లో క్రమశిక్షణ ఉంటేనే విజయం సాధ్యం అన్నారు. అంతర్జాతీయ పోటీల్లో క్రమశిక్షణ లేకపోవడం వల్లనే విజయాలు సాధించలేకపోతున్నాం అన్నారు. క్రీడల్లో స్వార్థం, నైపుణ్యం ఉంటేనే రాణిస్తాం. బాల్యంలో ఒక లక్ష్యం పెట్టుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రతి క్రీడాకారుడు ఆటల మీద దృష్టి సారించాలి. ఆడాలనే కసి ఉంటేనే దేశం తరపున ఆడే అవకాశం వస్తుంది. ఆటలో లీనమై, అదే ప్రపంచం అనుకోని ముందుకు నడవండి అప్పుడే జీవితం బాగుటుంది. గత ప్రభుత్వాలు ఆటలను పట్టించుకోలేదు. తెలంగాణ అంతటా క్రీడా స్ఫూర్తి నింపాలని ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని వివరించారు. ఆటలను టైం పాస్ గా కాకుండా విజయం సాధించే దిశగా అడుగులు వేయండి.దేశం, రాష్ట్రం తరుపున ఆడాలనే స్ఫూర్తి ఉండాలని సూచించారు. ఇకపోతే సీఎం కప్ –2026 సెకండ్ ఎడిషన్ కార్యక్రమం సందర్భంగా నేషనల్ మాస్టర్స్ అ÷–లథెట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివిధ విభాగాల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి మెడల్స్ సాధించిన అథ్లెట్స్ ను క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. వివిధ అ÷–లథెట్స్ లో మెడల్స్ సాధించి భారత, తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అథ్లెట్స్ ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

# గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు

**- నోడల్ అధికారుల నియామకానికి ప్రభుత్వం ఆదేశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):**

గురుకుల విద్యార్థుల సంక్షేమంపై తెలంగాణ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ సిద్ధం చేయాలని సూచించింది. జిల్లా షెడ్యూల్ ప్రకారం.. తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆకస్మిక సందర్శనలతో పాటూ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది. తనిఖీ నివేదికలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. అధికారులు తీసుకున్న చర్యల వివరాలు వెంటనే తెలియజేయాలని హుకుం జారీ చేసింది. ప్రతి నెలా 5వ తేదీలోపు నివేదిక సమర్పణని తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ఆధ్యాత్మిక వీరుల విగ్రహాలను నిర్మించడానికి ప్రభుత్వం, జిహెచ్ఎంసి అనుమతి ఇవ్వాలి

**- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి సీనియర్ నాయకుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ నేతృత్వంలో భారీ ర్యాలీ**

**హైదరాబాద్ ఫిబ్రవరి20( వెలుతురు):**

;ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే మరియు బిజెపి సీనియర్ నాయకుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ నేతృత్వంలో రామంతపూర్‌లో భారీ ర్యాలీ ఈ భూమి యొక్క సాంస్కృతిక, దేశభక్తి, ఆధ్యాత్మిక వీరుల విగ్రహాలను నిర్మించడానికి ప్రభుత్వం మరియు జిహెచ్ఎంసి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ర్యాలీకి నాయకత్వం వహించారు. నిజాం పాలన మరియు రజాకర్ దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బిజెపి ప్రస్తుత తరం మరియు భవిష్యత్తు తరానికి సామాజిక సంస్కర్తలు స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర మరియు త్యాగాలను తెలుసుకోవాలని అన్నారు. సర్దార్ సర్వైపాపన్నగౌడ్, సంతసేవాళ్ళు, ధన్వంతరి, పివి నరసింహారావు, అటల్‌బిహారి వాజ్‌పేయి, భీష్మ, పాండుగ సాయిన్న విగ్రహాలకు పూలమాలలు వేశారు. సాంస్కృతిక వీరుల బోధనలను అనుసరిస్తామని పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు. వేలాది మంది వీరుల చిత్రపటాలను మోసుకెళ్లారు.

# ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద అనూహ్య ఘటన

**- చొక్కాలు విప్పి వీరంగం సృష్టించిన కాంగ్రెస్ కార్యకర్తలు**

**- దేశప్రతిష్టను దిగజార్చే చర్య అన్న బిజెపి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి20( వెలుతురు):**

ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో శుక్రవారంనాడు అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. పలువురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి వీరంగం చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐ సమ్మిట్ జరుగుతున్న ఒక హాలులో ఈ ఘటన చోటుచేసుకుందని, కొందరు గుంపుగా వేదిక వద్దకు చేరి చొక్కాలు విప్పి గాలిలో ఊపుతూ నినాదాలు చేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పలువురిని నిర్బంధంలోకి తీసుకున్నామని, భారత్ మండపంలోకి ఈ గ్రూప్ ఎలా ప్రవేశించిందనే దానిపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు పాస్‌తో లోపలకు ప్రవేశించారా, క్యూఆర్ కోడ్‌తో లోపలకు వచ్చారా అనేది ఆరా తీస్తున్నారు. ఏఐ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనను బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ ఖండించారు. కాంగ్రెస్ చర్య దేశానికి సిగ్గుచేటని, చేసిన పనికి కాంగ్రెస్ సిగ్గుపడాలని అన్నారు. 'ఇది నేషనల్ షేమ్. టెక్నాలజీలో నాయకత్వం, ఇన్నొవేషన్‌కు పెద్దపీట వేస్తూ ప్రతిష్టాత్మక గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు భారత్ అతిథ్యం ఇస్తుంటే కాంగ్రెస్ పార్టీ అప్రతిష్టపాలు చేయాలనుకుంటోంది' అని అమిత్ మాలవీయ తప్పుపట్టారు. గ్లోబల్ టెక్నాలజీ పవర్‌హౌస్‌గా నిలిచేందుకు భారత్ కృషి చేస్తుంటే ఇలాంటి దుశ్చర్యలు దేశప్రయోజనాలకు భంగకరమని అన్నారు. రాజకీయంగా విభేదించడం ప్రజాస్వామిక హక్కు అని, అయితే అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దెబ్బతీయడం తగదని అన్నారు.




# అన్వేష్‌ను ఇండియా రప్పించడమే లక్ష్యం

**- పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు పోరాడుతా**

**- కరాటే కళ్యాణి స్పష్టీకరణ**

**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):**

అన్వేష్‌ను ఇండియా రప్పించడమే లక్ష్యం.. పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు పోరాడుతానని కరాటే కళ్యాణి స్పష్టీకరించారు. హిందూ దేవుళ్లనే కాకుండా.. భారతదేశ ఔన్నత్యాన్ని కించపరిచే విధంగా తెలుగు యూట్యూబర్ 'నా అన్వేషణ' అన్వేశ్ వ్యాఖ్యలు చేశారని ప్రముఖ సినీ నటి కరాటే కల్యాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్వేశ్ లాంటి వారిని ఉపేక్షించకూడదని హెచ్చరించారు. ఫాలోవర్స్ ఉంటే ఏది మాట్లాడితే అది చెల్లుబాటు అవుతుందని అనుకుంటే కుదరదని వార్నింగ్ ఇచ్చారు. హిందూ దేవుళ్లను కించపరిచినందుకే అన్వేశ్‌పై కేసు పెట్టామని.. తమ ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని కరాటే కల్యాణి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ.. అన్వేశ్ జీరోకు వచ్చారని.. ఎక్కడ స్టార్ట్ అయ్యారో.. అక్కడికే రావాలన్నది తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. అన్వేశ్‌లో మేకపోతు గాంభీర్యం కనిపిస్తోందని విమర్శించారు. యూట్యూబ్ పోతే పుడ్డ లేదన్న భయం అతనికి పట్టుకుందని కరాటే కల్యాణి ఎద్దేవా చేశారు. ఇన్‌స్టాగ్రామ్ బ్యాన్ అయ్యాక బుర్ర లేకుండా అతను మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అన్వేశ్ మానసిక స్థితి కూడా బాగోలేదని చెప్పుకొచ్చారు. అన్వేశ్ పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు తన పోరాటం కొనసాగుతోందని స్పష్టం చేశారు. అన్వేశ్‌ను భారతదేశం రప్పించడమే తమ లక్ష్యమని కరాటే కల్యాణి పేర్కొన్నారు.

# సంపాదకీయం..

# ఎన్నికల ఫలితాలు పనితీరుకు గీటురాయి కాదు !

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రయోజనాత్మక నిర్ణయాలు ఇంకా తీసుకోలేదు. అయితే వరుస ఎన్నికల్లో గెలవడం వల్ల అధిష్టానం వద్ద మార్కులు కొట్టేశారు. మంత్రులంతా కలిసి కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌ను కలిసి శహభాష్ అనిపించుకున్నారు. ఇలాగే పనిచేయండని కాంగ్రెస్ అగ్రనేతలు దీవించి పంపారు. ఇది మాత్రమే కాంగ్రెస్ విజయం కాదు. ఢిల్లీలో కూర్చున్న నేతలకు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన లేదు. సిఎం రేవంత్ కూడా క్షేత్రస్థాయి సమస్యలపై ఇంకా దృష్టి సారించలేదు. ప్రధానంగా తాగు,సాగునీటి సమస్యలు, రైతుల నుంచి ధాన్యం సేకరణ, గిట్టుబాటు ధరలు అందించడం, నిరుద్యోగ సమస్యలు తీర్చడం వంటివన్నీ ప్రధానంగా వెన్నాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో తెలంగాణలో అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. కెసిఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉన్న సమస్యలే ఇంకా ఉన్నాయి. అవేవీ పరిష్కారం కాలేదు. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. అంతకు ముందు పంచాయితీ, ఇంకా అంతకుముందు రెండు ఉప ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలనకు గీటురాయి కాబోవు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వంపై కొంత కాలంగా విరుచుకుపడుతోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ పనైపోయినట్టేనని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నాయకులు అది నిజమని కూడా నమ్ముతున్నారు. ఈ ప్రచారానికి తోడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినందున ఇటీవలి వరుస ఎన్నికల ఫలితాలపై



సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే బిఆర్ఎస్ అంచనాకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. కేటీఆర్,హరీష్ రావులుకు ఈ ఫలితాలు ఓ రకంగా హెచ్చరిక లాంటివి. ఎందుకంటే గత పాలనలో తాము చేసిన పాపాలను పక్కన పెట్టి అదేపనిగా విమర్శలు చేస్తూ పోతే ప్రజలు ఆదరిస్తారని అనుకుంటున్నారు. ప్రజలు అన్ని విషయాలు తెలుసుకుంటున్నారు. ఏవరేమిటో గ్రహిస్తున్నారు. అయితే సిఎం రేవంత్ అందరినీ కలుపుకుని వరుస విజయాలను సాధిస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే అసమ్మతి గుర్తుకు వస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రి స్థాయి నాయకులమని భావిస్తారు. ఏక నాయకత్వాన్ని అంగీకరించరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇప్పటికీ తమ నేతగా అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఆయన జూనియర్ అని పలువురు వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. లాటరీ తగిలినట్టు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని బిఆర్ఎస్ చేస్తున్న ముఖ్యంగా కెటిఆర్ చేస్తున్న ఆరోపణఅలను వీరు కూడా భావిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవ్వరినీ నొప్పించకుండా వెళుతోంది. అందుకే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంది. అయితే, రేవంత్‌రెడ్డి మాత్రం వ్యూహాత్మకంగా పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అగ్ర నాయకకతంవ ముందు మార్కులు కొట్టేస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడు తనకున్న పట్టు ఏమిటో నిరూపించుకుంటున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో మంత్రులందరికీ జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి సమన్వయం చేసుకొని సత్ఫలితాలను సాధించారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ మంచి ఫలితాలను సాధించేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేశారు. తనకంటే ఎంతో మంది సీనియర్లున్న కాంగ్రెస్‌ను ఏక తాటిపై నడిపించడంలోనూ రేవంత్‌రెడ్డి కృతకృత్యులయ్యారు. కాంగ్రెస్ సీనియర్లు కూడా తన నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితిని కల్పిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలకైనా, నాయకులకైనా ఎన్నికల ఫలితాలే గీటురాయి. మొన్న పంచాయతీ ఎన్నికలు, నిన్న మునిసిపల్ ఎన్నికల్లో 60 శాతంపైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా తన నాయకత్వ విషయంలో ఎదురవుతున్న ఆటంకాలను ఆయన అధిగమిస్తూ వచ్చారు. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ముఖ్యమంత్రిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నట్టుగా ఉంది. తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం కూడా రేవంత్ భుజం తట్టి ప్రోత్సహించింది. శహభాష్ అంటూ పొగిడింది. ఇలాగే నడవండి అంటూ అందరినీ కలిపి సూచించింది. అయితే ఇవొక్కటే రేపటి గెలుపునకు బాటలు వేయవు. గుణాతమక మార్పులు రావాలి. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. మంత్రులు వసూల్ రాజాలుగా మారారని పుంఖానుపుంఖానుగా ఆరోపణలు వస్తున్నాయి. పర్సంటేజీలకు అలవాటు పడ్డారని అంటున్నారు. ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. ఈ అంశంపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. ఉద్యోగుల్లో లంచావతారాలు పెరిగాయి. విద్యుత్ శాఖలో ఏకబిగిన ఓ 9మందిని సస్పెండ్ చేశారు. రోజుకోచోట్ ఎక్కడో ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నాడు. ఈ సమస్య పోవాలి. గంజాయి బ్యాచ్‌లను నిరోధించాలి. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఈ ఫలితాలు ప్రభుత్వంలో, పార్టీలో రేవంత్‌రెడ్డి స్థానం మరింత పటిష్ఠమవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఇంకో మూడేళ్ల వ్యవధి ఉంది. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. అది నిజమైతే బీఆర్ఎస్‌కు మైనస్ అవుతుంది. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోగలగాలి. అందుకు కార్యాచరణ అవసరం.

## ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై రకరకాల వ్యాఖ్యానాలు

**- కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు..అభినందించిన శశిథరూర్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి20( వెలుతురు):**
ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై రకరకాల వ్యాఖ్యానాలు వచ్చాయి. ప్రధానంగా కాంగ్రెస్‌లో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ చాలా బాగా జరిగిందంటూ కొనియాడారు. పెద్ద కార్యక్రమాల్లో కొన్ని అవాంతరాలు జరుగుతుంటాయని.. అయినా కూడా కేంద్రం చాలా బాగా నిర్వహించిందని మెచ్చుకున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఏఐ సమ్మిట్‌ను విమర్శించారు. 'అస్తవ్యస్తమైన ప్రజా సంబంధాల ప్రదర్శన' అని అభివర్ణించారు. చైనా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్రంగా తప్పుపట్టారు. ఫిబ్రవరి 17న జరిగిన శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ రోజున పొడవైన క్యూలు, భారీ జనసమూహం, లాజిస్టికల్ సమస్యలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. భద్రతా సిబ్బంది నుంచి స్పష్టమైన సూచనలు లేకుండానే గేట్లు మూసేశారని సందర్శకులు తెలిపారు. పెద్ద ఎత్తున వార్తలు హల్‌చల్ చేశాయి. అలాగే గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ విశ్వవిద్యాలయం వివాదానికి దారితీసింది. 'ఓరియన్' అనే రోబోటిక్ కుక్కపై విమర్శలు రావడంతో ఆ విశ్వవిద్యాలయాన్ని ఎక్స్‌పో స్థలాన్ని ఖాళీ చేయమని కోరారు. ఇదిలా ఉంటే ఏఐ సమ్మిట్ నిర్వహణను రాహుల్ గాంధీ తప్పుపడితే.. శశిథరూర్ మాత్రం అభినందించారు. శిఖరాగ్ర సమావేశానికి వెళ్లే అవకాశం నాకు లభించకపోయినా శుక్రవారం నేను ఇక్కడ మాట్లాడుతున్నాను. నాకు అర్థమైనంత వరకు మొదటి రెండు రోజులు చాలా బాగా గడిచాయి. కొన్ని లోపాలు, కొన్ని సంస్థాగత విషయాలు ఉన్నాయి. ఇవి ఒక పెద్ద కార్యక్రమంలో జరుగుతాయని శశిథరూర్ తెలిపారు. ఇటీవలే శశిథరూర్‌తో కాంగ్రెస్ పెద్దలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై చర్చించారు. కేరళ ఎన్నికల వేళ ఇదో శుభపరిణామంగా భావించారు. మళ్లీ ఇంతలో ఏమైందో ఏమో తెలియదు గానీ.. మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని శశిథరూర్ ప్రశంసించారు.

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**- మత్స్యావతార అలంకారంలో నారసింహుడు**

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి20( వెలుతురు):**
మహిమాన్విత యాదగిరిగుట్టపై పంచ నారసింహుడిగా కొలువైన దేవ దేవుడి మత్స్యావతార అలంకార వైభవం భక్త జనులను అలరించింది. స్వామి వారి ప్రధానాలయం లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం నిత్యపూజ కైంకర్యాల అనంతరం మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని అభిషేకించి మత్స్యావతారుడిగా అలంకరించి ఆస్థానం చేశారు. నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దివ్యప్రబంధ ప్రాశుర పఠనాలను కనుల పండువగా చేపట్టారు. దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం ప్రత్యేకత అంటూ ప్రధానార్చకులు మత్స్యావతార విశిష్టతను వివరించారు. పట్టు వస్త్రాలు, బంగారు, వజ్రా భరణాలు, వివిధ రకాల పుష్పాలతో దివ్య మంగళకరంగా అలంకరించిన స్వామి వారిని కొలుస్తూ మంత్రోచ్ఛరణలు, మూలమంత్ర జప స్తోత్రాలు సాగుతుండగా గోవిందనామ స్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటన్‌లో ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌పై తీవ్ర దుమారం

**- మాజీ యువరాజు ఆండ్రూ సమక్షంలోనే బాలికకు కరెంట్ షాక్**




**లండన్,ఫిబ్రవరి20( వెలుతురు):**
ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ బ్రిటన్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఆ దేశ రాజ కుటుంబానికి చెందిన మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటెన్- విండ్సర్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన గురించి మరిన్ని ఆరోపణలు బయటకు వచ్చాయి. బ్రిటన్ మీడియా కథనాల ప్రకారం.. ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసున్న ఓ బాలికకు సెక్స్ రాకెట్ నేరస్థుడు ఎప్‌స్టీన్ ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చి హింసించాడని, అప్పుడు ఆండ్రూ అక్కడే ఉన్నాడని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఆ బాలికను టేబుల్‌పై బంధించి ఈ అరాచకానికి పాల్పడ్డారని ఓ గుర్తుతెలియని వ్యక్తి సమాచారమిచ్చారు. ఈ ఆరోపణలు ఎఫ్‌బీఐ పత్రాల్లో ఉన్నాయి. ఈ ఘటన బ్రిటన్‌లోని ఫ్రాగ్మోర్ కాటేజ్‌లో జరిగిందని ఆ కథనాలు వెల్లడించాయి. అయితే ఆండ్రూ మాత్రం తనపై వచ్చిన ఈ ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించారు. 1994 నుంచి 1996 మధ్యలో హ్యూమన్ ట్రాఫికింగ్, మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణల గురించి అవగాహన ఉందని సర్రే పోలీసులు వెల్లడించారు. అయితే దానిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. ఈ రెండు ఘటనలకు సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ఆరోపణలకు సంబంధించి ఎవరివద్ద అయినా సమాచారం ఉంటే తమకు రిపోర్ట్ చేయాలని కోరారు. కాగా.. అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా.. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై ఆండ్రూను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. కొన్ని గంటలు విచారించిన అనంతరం ఆయన విడుదలయ్యారు. అయితే ప్రస్తుతానికి ఆయనపై ఎలాంటి అభియోగాలు మోపలేదు.

## హిందూపురంలో బాలయ్యకు నివాసం

**- కొత్త ఇంటి నిర్మాణానికి భార్యతో కలసి శంకుస్థాపన**



**హిందూపురం,ఫిబ్రవరి20( వెలుతురు):**
హిందూపురం శాసనసభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారు. శుక్రవారం సతీమణి వసుంధర దేవితో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ సొంతింటి నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. హిందూపురంలో హ్యాట్రిక్ విజయంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణ ఇన్ని రోజులు ఇక్కడ అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురంలో ఓ ఇంటి వాడవుతున్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా గెలిచిన ఎమ్మెల్యే బాలకృష్ణ.. నియోజకవర్గ పర్యటనకు హైదరాబాద్ నుంచి వచ్చి వెళుతుంటారు. అయినా నియోజకవర్గ ప్రజలు కానీ, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే బాలకృష్ణ ఎప్పుడు హిందూపురం వచ్చిన అంతే ఉత్సాహంతో ఉంటున్నారు. ఇటీవల ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణపై సంచలన ఆరోపణ చేశారు. హైదరాబాదులో ఉండే బాలకృష్ణ, హిందూపురంలో పరిపాలిస్తున్నారంటూ విమర్శించారు. వారు చేసిన కామెంట్స్ హిందూపురంలో ప్రకంపనలు పుట్టించాయి. ప్రత్యర్థులకు హిందూపురంలో తాను స్థానికుడిని కాదు అని చేస్తున్న వ్యాఖ్యలకు.. అవకాశం ఇవ్వకూడదని ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించుకున్నారు. దీంతో హిందూపురం పట్టణంలో సొంతింటి నిర్మాణానికి సిద్ధమయ్యా రు. హిందూపురం సమీపంలోని వన్నమ్మ కాలనీలో సర్వే నెంబర్ 445లో 81 సెంట్ల భూమిని ఎమ్మెల్యే బాలకృష్ణ కొనుగోలు చేశారు. ఆ స్థలంలో మూడంతస్తుల భవనంతో పాటు.. స్విమ్మింగ్ పూల్, ఆహ్లాదకరమైన ఉద్యానవనం, ఇతర సౌకర్యాలతో ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం. తమ అభిమాన నటుడు, హ్యాట్రిక్ విక్టరీ కొట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ కొత్త ఇల్లు ఎలా ఉంటుందో అని హిందూపురంలో ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### ట్రంప్ నిర్ణయాలపై
## విమర్శలు

**- ఇండో అమెరికన్లలో తీవ్ర అసంతృప్తి**



**వాషింగ్టన్,ఫిబ్రవరి20( వెలుతురు):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై ఇండో-అమెరికన్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ట్రంప్ తీసుకుంటున్న చర్యలు మింగుడు పడడం లేదు. ఇప్పటికే అమెరికాలో ఆ దేశస్తులు రోడ్డెకకి నిరసనలు తెలిపారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను నిర్వహిస్తున్న తీరును 55 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. కార్నెగి ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ విడుదల చేసిన '2026 ఇండియన్ అమెరికన్ ఆటిట్యూడ్ సర్వే'లో ఈ విషయం వెల్లడైంది.యూగవ్ భాగస్వామ్యంతో నవంబర్ 25, 2025 నుంచి జనవరి 6, 2026 మధ్యలో ఈ సర్వే జరిగింది. ఇందులో వెయ్యి మంది ఇండియన్ అమెరికన్లు పాల్గొన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో ట్రంప్ విధానాలను 55 శాతం మంది వ్యతిరేకించారు. వాణిజ్యం, వ్యూహాత్మక సహకారంలో నెలకొన్న విభేదాలు క్వాడ్ కూటమని, ఇండో-పసిఫిక్ లక్ష్యాలను దెబ్బతీశాయని వారు పేర్కొన్నారు. 25 శాతం మంది మాత్రం ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేదు. మరో 20 శాతం మంది ఆమోదించడం గమనార్హం. మాజీ అధ్యక్షుడు జోబైడెన్‌కు ఈ ఆమోదరేటు 48 శాతంగా ఉండటం గమనార్హం.

## తిరుమలకు నెయ్యి సరఫరాపై వైసిపి వాయిదా తీర్మానం

**- చర్చ జరిగితేనే నిజాలు తెలుస్తాయన్న విపక్షనేత బొత్స**

**అమరావతి,ఫిబ్రవరి20( వెలుతురు):**
మండలిలో వైఎస్సార్‌సీపీ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. తిరుపతి లడ్డూ ప్రసాద అంశం, హెరిటేజ్ సంస్థకి అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ, టీటీడీకి నెయ్యి సరఫరా చేయడంపై సభలో చర్చించాలని కోరుతూ వాయిదా తీర్మానం చేశారు. శాసనమండలికి ర్యాలీ వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు.. భోలే బాబా.. చంద్రబాబా.. చంద్రబాబా.. ఆలీబాబా అంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. ఇందాపూర్, హెరిటేజ్ లింకులపై చర్చించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. శ్రీవారి లడ్డూపై చంద్రబాబు నిందలు మోపారని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. దేవదేవుడి ధనాన్ని లూటీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. బాబు ప్రభుత్వం పెట్టిన డొల్ల బ్జడెట్‌పై చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో జోయాలుక్కాస్ కొత్త షోరూమ్ ప్రారంభం

**- ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి హాజరు**

**ఎల్బీనగర్, వెలుతురు ఫిబ్రవరి 20, 2026:**
ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్, జోయాలుక్కాస్, ప్రపంచవ్యాప్తంగా తన విస్తరణ ప్రణాళికను వేగవంతం చేస్తోంది. భారతదేశంలోని తెలంగాణలో, హైదరాబాద్ శివారు ప్రాంతమైన వనస్థలిపురం కొత్త షోరూమ్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. అత్యాధునికమైన ఈ దుకాణం జోయాలుక్కాస్ యొక్క ప్రత్యేకమైన సౌందర్యంతో మరియు అత్యుత్తమ సౌకర్యాలతో రూపొందించబడ్డాయి, ఇవి వినియోగదారులకు ప్రపంచ స్థాయి ఆభరణాల కొనుగోలు అనుభూతిని అందిస్తాయని వాగ్దానం చేస్తున్నాయి. వనస్థలిపురం షోరూమ్ యొక్క ప్రారంభోత్సవం 20 ఫిబ్రవరి 2026, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగింది. కొనుగోలుదారులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ రూపొందించబడిన కొత్త షోరూమ్ ఆధునిక అంతర్గత అలంకరణలు మరియు ప్రతి ఆభరణాల కోసం ప్రత్యేక విభాగాలతో కూడిన ఇంటీరియర్స్ మరియు విశాలమైన లేఅవుట్. వ్యక్తిగతీకరించిన సేవలను అంతర్జాతీయ ప్రమాణాలతో జోడించి, జోయాలుక్కాస్ హైదరాబాద్‌లోని ఆభరణాల ప్రియులకు చక్కటి ఆభరణాల కొనుగోలును పునర్నిర్వచించడానికి సిద్ధంగా ఉంది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, జోయాలుక్కాస్ ప్రారంభోత్సవ బహుమతిగా అన్ని గోల్డ్, డైమండ్, ప్లాటినం, ప్రెషస్ మరియు సిల్వర్ ఆభరణాలపై మజూరీ ఛార్జీలపై (వ.గా)



40% తగ్గింపును ప్రకటించింది. ఈ పరిమిత కాల ఆఫర్ మార్చి 8 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది, కాబట్టి కొనుగోలుదారులు కొత్త షోరూమ్‌ను ముందుగా సందర్శించడానికి ప్లాన్ చేసుకోవాలని సూచించబడింది. జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ ప్రారంభోత్సవాన్ని ప్రకటించారు. "మా లక్ష్యం ఎల్లప్పుడూ ప్రతి ఇంటికి అత్యుత్తమ ఆభరణాల నమూనాలను తీసుకురావడమే. గొప్ప సంప్రదాయాలు మరియు శక్తివంతమైన సంస్కృతికి ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ శివారు ప్రాంతమైన వనస్థలిపురంలో మా ఉనికిని విస్తరించడానికి మేము సంతోషిస్తున్నాము. ఈ కొత్త షోరూమ్ చక్కదనం, విస్తారమైన రకాలు మరియు ఆధునిక సౌకర్యాలను అందంగా మిళితం చేసి మరపురాని అనుభూతిని అందిస్తాయి. మా ప్రారంభ వేడుకల్లో పాల్గొనడానికి, మా సేకరణలను అన్వేషించడానికి మరియు ప్రపంచంలోనే అభిమాన ఆభరణాల దుకాణంతో కొనుగోలు చేసే ప్రత్యేక ఆనందాన్ని కనుగొనడానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము. ఉత్తేజకరమైన ఆఫర్లు మీ కోసం వేచి ఉన్నాయి, మా విలువైన వినియోగదారులతో ఈ మైలురాయిని జరుపుకోవడానికి మేము ఎదురుచూస్తున్నాము." అని అన్నారు". అందమైన ఆభరణాల సేకరణలను అన్వేషించడానికి మరియు ఒక ప్రత్యేకమైన షాపింగ్ ప్రయాణాన్ని ప్రారంభించడానికి మీరు కొత్త జోయాలుక్కాస్ షోరూమ్‌లను సందర్శించవచ్చు.

# పర్లపల్లి లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర



**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 20:**
తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర ను నిర్వహించారు. శివాజీ జయంతి సందర్భంగా పర్లపల్లిలోనిశివాజీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన శోభాయాత్ర కన్నుల పండుగ సాగింది. హైందవ ధర్మ స్థాపన కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన యోధుడు, హిందుత్వమే నినాదంగా , స్వధర్మమే ప్రధానంగా భారత జాతిలో స్వాభిమానాన్ని నింపిన వీరుడు, భారత జాతిని పుష్కరుల నుండి రక్షించిన ధీరుడు , హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ అని శివాజీ ఉత్సవ సమితి నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ లతో సహా వివిధ పార్టీల రాజకీయ నాయకులు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శివాజీ ఉత్సవ సమితి కోరిక మేరకు గ్రామంలో శివాజీ విగ్రహా ఏర్పాటుకు సహకరిస్తామని సర్పంచ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# 45వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీకి ఘన సత్కారం

**- రాజీవ్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో అభినందన సభ**





**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 20:**
45వ డివిజన్ కార్పొరేటర్ గా భారీ మెజారిటీతో గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి గుగ్గిళ్ల జయశ్రీని కరీంనగర్ లో ఘనంగా సత్కరించారు. నగరంలోని మంకమ్మతోట రాజీవ్ గాంధీ పార్క్ లో రాజీవ్ డెవలప్ మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కాలనీకి చెందిన ప్రముఖులు హాజరై... కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్ తోపాటు మాజీ కార్పొరేటర్ దిండిగాల మహేష్ ను శాలువాలతో సన్మానించారు. డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని... కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ అన్నారు. తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించిన డివిజన్ వాసులందరికీ ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఏ సమస్య వచ్చిన తనను గాని తన భర్తను గాని సంప్రదించాలని కోరారు. ఐదేళ్లపాటు తనకు కార్పొరేటర్ గా అవకాశం కల్పించిన డివిజన్ వాసులకు మాజీ కార్పొరేటర్ దిండిగాల మహేష్ ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ... సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్ తోపాటు మాజీ కార్పొరేటర్లు తుమ్మల రమేష్ రెడ్డి, దిండిగాల మహేష్, రాజీవ్ డెవలప్ మెంట్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరావు, రాజిరెడ్డి, కంటె శంకర్, ట్రెజరర్ యుగెందర్ రావు, వినాయక కమిటీ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అరికెల రమేష్, మేకల శ్రీనివాస్, సులేమాన్, పర్కాల నారాయణ గౌడ్, సింగరమరాజు, శ్రీరామ్ రెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# యాదయ్యకు అన్యాయం జరిగితే చలో ఇబ్రహీంపట్నం

**-బీసీ నాయకుల హెచ్చరిక**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 20:**
ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ యాదయ్యకు అన్యాయం చేస్తే చలో హైదరాబాద్ కు పిలుపునిస్తామని బీసీ సంఘాల నాయకులు హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదయ్య తో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ, శ్యామ్, కులకచర్ల శ్రీనివాస్ లు మాట్లాడారు. ఎన్నికల ముందు చైర్మన్ పదవి ఇస్తానని నమ్మించి గెలిచిన అనంతరం కిడ్నాప్ కు పాల్పడడం అనైతిక చర్య అంటూ మండిపడ్డారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆయన కుమారుడు మరో నయీమ్ ను తలపించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా ప్రతినిధిని కిడ్నాప్ చేయడమే కాకుండా ఆయన కుటుంబాన్ని తీవ్ర మనోవేదనకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు హైకోర్టు జోక్యంతో యాదగిరిని బయటకు తీసుకొచ్చారని అన్నారు. ఓవైపు తెలంగాణ వ్యాప్తంగా బీసీ ఉద్యమం కొనసాగుతుండగా నైతిక విలువలకు లోబడి పార్టీలు మారకుండా ఆ పార్టీల గెలుపు కోసం ప్రయత్నిస్తున్న నాయకులను కిడ్నాప్ చేయడం ఏమిటని మండిపడ్డారు. చిన్న విషయాలకు ట్విట్టర్లో స్పందించే కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ఇబ్రహీంపట్నం చైర్మన్ పదవిని యాదయ్యకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 48 గంటలలో యాదయ్యను కిడ్నాప్ చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే చలో ఇబ్రహీంపట్నం పిలుపునిస్తామని హెచ్చరించారు. కెసిఆర్ కేటీఆర్ లు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితులు యాదయ్య విజ్ఞప్తి చేశారు.

# స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా పురస్కారం

**- 2026కు ఎంపికైన డా. పట్నాల. సావిత్రి సమాజ సేవలో విశిష్ట కృషి**

**హైదరాబాద్, వెలుతురు ఫిబ్రవరి 20**
శ్రీ వాజ్ పేయి అద్వాని సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య సమర యోధుడు " ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా పురస్కారం 2026" కోసం ప్రముఖ సామాజిక సేవకురాలు, మరియు హ్యూమన్ రైట్స్ కార్యకర్త, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అవార్డుకు ఎంపికైన పట్నాల సావిత్రి సీనియర్ సోషల్ వర్కర్ ,మోటివేషన్ స్పీకర్, సాహితీ కర్త మరియు. భారతీయ సాంస్కృతిక కళా రంగాల కార్యక్రమ నిర్వాహకురాలు. ఇబ్రహీంపట్నం కాన్స్టెన్సీ అబ్దుల్లాపూర్మెట్ మండలం మునగనూరు గ్రామం ఆదర్శ్ నగర్ కాలనీ కి చెందిన పట్నాల సావిత్రి , సేవా కార్యక్రమాలలో విశిష్ట కృషి చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు సమాజానికి స్వచ్ఛందంగా నిస్వార్థంగా అందిస్తూ తన వ్యక్తిగతంగా. తన సొంతంగా పేద ప్రజలకు ఆసరాగా అండగా ఉండి.. ప్రత్యేకమైనటువంటి శ్రద్ధ తీసుకొని పూరి గుడిసెల్లో ఉన్న పేద ప్రజలకు అన్నదానం, వస్త్ర దానం ,మరియు కొంత డబ్బును ఇచ్చి ఆదుకుంటున్నారు, ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేని వారికి ఉద్యోగాలకు అర్హులైన వారిని తనకి తెలిసిన



కంపెనీస్లో ఉద్యోగ అవకాశాలను ఇవ్వడానికి కృషి చేస్తున్నారు.. మోటివేషన్ ద్వారా ఒక చక్కటి అవేర్నెస్ ప్రోగ్రాం ని కూడా నిర్వహించి వారి జీవితాల్లో దృఢ సంకల్పాన్ని,మనో ధైర్యాన్ని నింపి ఒక కొత్త జీవితానికి మార్గదర్శకంగా నిలబడుతున్నారు నేటి యువత సమాజ నిర్మాణానికి గట్టి పునాదులుగా ఎదగడానికి యువతను చైతన్య పరుస్తున్నారు.. 20 సంవత్సరాల నుంచి సమాజ సేవా కార్యక్రమాలలో ఎన్నో సేవలు అందిస్తూ రెండు తెలుగు రాష్ట్రాలలో మంచి గుర్తింపును పొందారు. పట్నాల సావిత్రి గారు చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను గుర్తించి శ్రీ వాజ్ పేయి అద్వాని సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలకొలను పీరారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 22 ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్వచ్ఛందంగా నిరంతర సమాజంలో సేవలు చేస్తున్నటువంటి వారికి ఆన్లైన్ ద్వారా అవార్డ్స్ అందించడం జరిగింది . ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి .యస్. నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ గిద్దలూరు.

# నా ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము గంగుల కమలాకర్ కు లేదు...

**- నాపై అసత్య ప్రచారాలు చేయించడానికి సిగ్గుండాలి...**

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్....**

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 20:**
కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడే దమ్ము ధైర్యం లేకుండా పోయిందని , తాను సంధించిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక , పనికిమాలిన వాళ్లతో నాపై అసత్య ప్రచారాలు చేయించడానికి సిగ్గుండాలనీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్ ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు శనివారం రోజున గుగ్గిల రమేష్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. గంగుల కమలాకర్ పై తాను చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నానని, మాట్లాడిన భాషలో ఎక్కడ కూడా అన్ పార్లమెంటరీ వర్డ్స్ ఉపయోగించలేదన్నారు. చేసిన వ్యాఖ్యలకు గంగుల కమలాకర్ తనపై విద్వేషంతో జవాబు చెప్పలేక మీడియా ముందుకు వచ్చి మాట్లాడలేక ధైర్యం , దమ్ము లేకనే ఆయన అనుచరులతో మాట్లాడిస్తున్నారని , ఇది ఆయన



సిగ్గుమాలినతనానికి నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గుగ్గిల్లపు ఇంటిపై, వాసాల రమేష్ ఇంటిపై దాడులు చేయిస్తానని చెప్పిన కమలాకర్, నేటి వరకు దాడులు చేసే ధైర్యం చేయలేదని , భయపడ్డారన్నారు. . గంగుల కమలాకర్ కు ఇప్పటికైనా దమ్ముంటే తాను ఎప్పుడు ఒంటరిగానే తిరుగుతానని, నువ్వు వస్తావో, నీ అనుచరులను పంపిస్తావో.. దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. అసత్య ప్రచారాలు నీ అనుచరులతో మాట్లాడించడం ఆపకపోతే నీ రాజకీయ జీవితంలో ఎన్ని మలుపులను మీడియా ముఖంగా ఆధారాలతో సహా బయట పెడతానని హెచ్చరించారు. గుగ్గిళ్ళపు రమేష్ అంటే ఆషామాషీ వ్యక్తి కాదని ఐదుసార్లు ప్రజా జీవితంలో నిలబడి గెలిచానని నీలాగా భూమాఫీయాను ప్రోత్సహించి, గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని పెంచి పోషించలేదని.. ప్రజలను ఇబ్బంది పెట్టేటువంటి పనులను చేయలేదని ఆయన చెప్పారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మానుకొని మూసుకొని కూర్చొని ఉండాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నిన్ను రాజకీయంగా బొంద పెట్టడమే లక్ష్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ నాయకత్వం లో, బిజెపి పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యేగా ఎలా గెలుస్తావో చూస్తామని, మేము సవాల్ విసురుతున్నమనీ, ఈ సవాలుకు నువ్వు కట్టుబడి ఉండు నీకు దమ్ముంటే గెలిచి చూపించు, నువ్వు ఎలా గెలుస్తావో మేము చూస్తామని సవాల్ విసిరారు. 2028లో బిజెపిని అడ్డుకొని చూడు నీకు దమ్ముంటే, నువ్వు ఎమ్మెల్యే గా నిలబడు నీస్థానం ఏమిటో చూపిస్తామన్నారు. నీ చుట్టూ ఉన్న కోటరీ మాయం చేశాం, కేవలం డబ్బుకు నీ ఎంగిలి మెతుకులకు ఆశపడ్డ వాళ్లు మాత్రమే నీవద్ద మిగిలారని, డబ్బు బలంతోనే నువ్వు మిగిలి ఉన్నావని, గంగుల ప్రజాబలం ప్రజావిశ్వాసం కోల్పోయాడని ఎద్దేవా చేశారు.

# సైబర్ ఫ్రాడ్ కేసులో నలుగురు అరెస్టు

**జగిత్యాల వెలుతురు ఫిబ్రవరి 20:**
లావోస్ దేశంలో సైబర్ ఫ్రాడ్ ఉద్యోగాల పేరుతో యువతను అక్రమంగా తరలించి మోసాలకు పాల్పడిన నలుగురిని జగిత్యాల పోలీసులు అరెస్ట్ చేసారు. వారినుంచి నాలుగు సెల్ ఫోన్లు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. నిందితులు ఇస్లావత్ విజయేందర్ ఏ ఆంధ్రూ, మీసాల రాజశేఖర్, దండుగుల కళ్యాణ్ , శ్యామ్ రావు రాజశేఖర్. మరో నిందితుడు రాజు , ప్రస్తుతం లావోస్లో ఉన్నాడు. నిందితుడు విజయేందర్ 2024 నవంబర్లో లావోస్ వెళ్లి అక్కడి సైబర్ ఫ్రాడ్ నెట్వర్క్లో చేరాడు. ప్రతి వ్యక్తిని లావోస్కు రప్పిస్తే ఒక్కొక్కరికి 13,000 యువాన్లు (సుమారు ?1.75 లక్షలు) కమిషన్ ఇస్తామని చెప్పడంతో జగిత్యాల మరియు పరిసర ప్రాంతాల యువతను రిక్రూట్ చేయడం ప్రారంభించాడు. బ్యాంకాక్ కాల్ సెంటర్ ఉద్యోగం పేరుతో ఒక్కొక్కరి నుండి ?75,000 నుండి ?1,05,000 వరకు వసూలు చేసి, ముందుగా టూరిస్టు వీసాపై థాయిలాండ్




(బ్యాంకాక్) కు రప్పించి, అక్కడి నుండి ఏజెంట్ల ద్వారా సరిహద్దు అక్రమంగా దాటి లావోస్ దేశంలోని గోల్డెన్ ట్రయాంగిల్ ప్రాంతానికి తరలించేవారు. అక్కడ చైనా కంపెనీల ఆధ్వర్యంలో నడుస్తున్న సైబర్ కాల్ సెంటర్లలో పని చేయమని బలవంతం చేసేవారు.అమెరికా ఇన్ఫ్లుయెన్సర్ల పేర్లతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి, ముఖ్యంగా జూంలో నివసిస్తున్న భారతీయులను లక్ష్యంగా చేసుకుని ఆన్లైన్ మోసాలు చేయించేవారు. పని చేయనని చెప్పిన వారికి పాస్పోర్టులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడేవారు. మోసపోయిన బాధితుని ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు విజయేందర్పై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేయగా,మంగళవారం నాడు శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేసి జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్కు తరలించారు. విచారణలో మిగతా ముగ్గురు నిందితుల వివరాలు వెలుగులోకి రావడంతో వారిని కూడా అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 4 సెల్ ఫోన్లు, కీలక పత్రాలు, విదేశీ ప్రయాణాలకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్కు తరలించారు.

# సిగరెట్ కాల్చవద్దన్నందుకు ఆగ్రహం

**- పెట్రోల బంక్‌లో అగ్గిపుట్టించి హంగామా**

**- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్**

**రాయ్‌పూర్,ఫిబ్రవరి 20 ( వెలుతురు):**
పెట్రోల్ బంకు వద్ద సిగరెట్ కాల్చేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించగా, వద్దని పెట్రోల్ బంకు సిబ్బంది కోరడంతో. ఆగ్రహించిన ఆ వ్యక్తి పెట్రోల్ నింపుతున్న బైక్ ట్యాంకులోకి లైటర్ విసిరాడు. దీంతో మంటలు ఎగసిపడ్డాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 18న రాత్రి 7:40 గంటల సమయంలో ఉర్లా ప్రాంతంలోని పెట్రోల్ బంకు వద్దకు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. ఆ బైక్‌లో పెట్రోల్ నింపుతుండగా వెనుక కూర్చొన్న వ్యక్తి కిందకు దిగి సిగరెట్ వెలిగించేందుకు ప్రయత్నించాడు. గమనించిన పెట్రోల్ బంకు ఉద్యోగి సిగరెట్ కాల్చవద్దని అతడికి చెప్పాడు. ఆగ్రహించిన ఆ వ్యక్తి పెట్రోల్ నింపుతున్న బైక్ ట్యాంకులోకి లైటర్ విసిరాడు. దీంతో బైక్‌తో పాటు అక్కడ మంటలు ఎగసిపడ్డాయి. పెట్రోల్ బంకు ఉద్యోగి, బైక్‌పై ఉన్న వ్యక్తి భయంతో అక్కడి నుంచి పరుగెత్తారు. మరోవైపు పెట్రోల్ బంకు ఉద్యోగి ఆ వెంటనే అప్రమత్తమయ్యాడు. ఇంధనం సరఫరా నిలిపివేశాడు. అగ్నిమాపక పరికరంతో మంటలను ఆర్పివేశాడు. ఇంతలో పారిపోతున్న ఆ ఇద్దరు వ్యక్తులను బంకు సిబ్బంది పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకున్న తర్వాత ఆ ఇద్దరిని అప్పగించారు. ఆ ఇద్దరు వ్యక్తులను ధర్మేంద్ర సింగ్, ఇమ్రాన్ ఖురైషిగా పోలీసులు గుర్తించారు. వారిని అరెస్ట్ చేశారు. వారి బైక్‌తో పాటు లైటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. కాగా, ఆ పెట్రోల్ బంకు వద్ద ఉన్న సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

**- సిట్ నివేదికపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్**

**- ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం**

**అమరావతి,ఫిబ్రవరి 20( వెలుతురు):**
తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తయ్యి నివేదిక సమర్పించిన నేపథ్యంలో.. ఆ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ అధ్యక్షతన ఈ ఏకసభ్య కమిటీని ఏపీ సర్కార్ నియమించింది. ఈ కమిటీ ప్రధాన బాధ్యత.. సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలను పూర్తిగా పరిశీలించడం, దర్యాప్తులో బయటపడ్డ విషయాలను విశ్లేషించడం, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వడం. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం, ఈ ఏకసభ్య కమిటీ 45 రోజుల్లోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సిట్ నివేదికలో ఉన్న అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి, అవసరమైతే అదనపు వివరాలను సేకరించి.. బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేయనుంది. తిరుమలలో శ్రీవారి లడ్డూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు. అలాంటి పవిత్ర ప్రసాదం విషయంలో కల్తీ ఆరోపణలు రావడం భక్తుల్లో ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసింది. సిట్ ఇప్పటికే లడ్డూ తయారీ ప్రక్రియ, ముడి సరుకుల సరఫరా, నాణ్యత నియంత్రణ వ్యవస్థ, సంబంధిత అధికారుల పాత్ర వంటి అంశాలపై విస్తృత విచారణ జరిపింది. ఆ నివేదిక ఆధారంగా ఇప్పుడు ఏకసభ్య కమిటీ మరింత సమగ్రంగా విశ్లేషణ చేయనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# మండలిలలో దేవుడి ఫోటోల ప్రదర్శన

**- వైకాపా తీరుపై అధికార కూటమి ఆగ్రహం**

**- ఛైర్మన్ పోడియం వద్ద వైసిపి సభ్యుల నిరసన**

**- వరుస వాయిదాల తరవాత మండలి సోమవారానికి వాయిదా**

**అమరావతి,ఫిబ్రవరి 20 ( వెలుతురు):**
దేవుడి అంశం శాసనమండలిని కుదిపేసింది. శ్రీ వేంకటేశ్వరస్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు సభలో నిరసనకు దిగడం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఈ క్రమంలో సభ వాయిదా పడగా.. కాసేపటికి తిరిగి మొదలైంది. అయితే వైసీపీ క్షమాపణలు చెప్పాలని టీడీపీ డిమాండ్ చేయగా... తాము దేవుడిని అవమానించలేదంటూ వైసీపీ ఎమ్మెల్సీల ఆందోళనతో మరోమారు వాయిదా పడింది. శుక్రవారం ఉదయం వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మాలను ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించడంతో.. ఆ పార్టీ ఎమ్మెల్సీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నిరసన చేపట్టారు. వేంకటేశ్వర స్వామి ఫొటోలతో ఆందోళనకు దిగారు. వైసీపీ తీరును మంత్రి పయ్యావుల కేశవ్ తప్పుబట్టారు. వైసీపీ సభ్యుల ఆందోళనతో సభ వాయిదా పడింది. తిరిగి కొద్దిసేపటికి సభ మొదలైనా.. మరోమారు కూటమి సభ్యులు ఆందోళనకు దిగారు. ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి.. దేవుడిని అవమానించిన వైసీపీ సభ్యులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవదేవుడిని వైసీపీ సభ్యులు అవమానించారంటూ కూటమి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. దేవుడిని తాము అవమానించలేదంటూ వైసీపీ ఎమ్మెల్సీలు పోడియం వద్దకు వచ్చారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే మండలి సమావేశాన్ని ఛైర్మన్ సోమవారానికి వాయిదా వేశారు.

# నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**- వైసిపి తీరుకు నిరసనగా కూటమి కార్యక్రమాలు**

**అమరావతి,ఫిబ్రవరి 20( వెలుతురు):**
ఏపీ ఎన్డీఏ కూటమి పక్షాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. శాసనమండలిలో వైసీపీ సభ్యులు.. వేంకటేశ్వర స్వామి ఫొటోలతో చేసిన మహాపచారంపై ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా కూటమి పక్షాల నేతలు, మంత్రులు, పార్టీ అధ్యక్షులతో శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం ఏపీలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు, సంప్రోక్షణ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రాల్లో కూటమి పక్షాల నేతలు ప్రెస్‌మీట్‌లు నిర్వహించి, దేవుడికి జరిగిన అపచారాన్ని ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. కలిసివచ్చే, బావ సారూప్యత ఉన్న వివిధ మఠాధిపతులు, స్వామిజీలతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్ణయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు వెంటనే సమాచారం పంపాలని అన్ని పార్టీల నాయకులకు ఆదేశాలు జారీ అయ్యాయి. శనివారం కావడంతో ఆలయాల వద్ద ప్రక్షాళన చేయాలని కొందరు కూటమి నేతలు కోరారు. ఇలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని కూటమి సభ్యులు సూచించారు. అలాగే వైసీపీ విషయంపై భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయాలని చర్చించాయి. జూమ్ కాన్ఫరెన్స్‌లో వీటిపై నిర్ణయం తీసుకున్నారు.

# చేబ్రలులో వేంకటేశ్వర వైభవం

**ఏలూరు,ఫిబ్రవరి 20 ( వెలుతురు):**
ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని కనులపండుగగా నిర్వహించారు. చేబ్రోలుకి చెందిన కూనపరాజు మురళీకృష్ణరాజు-దుర్గాదేవి దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ క్రతువు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ రాందే లక్ష్మీ సునీత, మాజీ సర్పంచ్ రాందే రాజారావు, బొండాడ ప్రసాద్, బొమ్మిడి అప్పారావు, మంతెన ప్రకాష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# జహీరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ 8వ జిల్లా మహాసభలు

**- విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలి...**

**- యూజీసీ సమానత్వ నిబంధనలు అమలు చేయాలి...**

**- నూతన విద్యా విధానం రద్దు చేయాలి....**

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 20:**
స్టూడెట్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) సంగారెడ్డి జిల్లా 8వ మహాసభలు జహీరాబాద్ పట్టణంలోని బీబీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లావ్యాప్తంగా నుంచి విద్యార్థి ప్రతినిధులు హాజరైన ఈ మహాసభల్లో విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పుడు విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం 7.8 శాతానికి పరిమితం చేయడం దురదృష్టకరమన్నారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల వేలాది






మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగడం సరికాదని, వాటికి శాశ్వత భవనాలు నిర్మించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి దోపిడీని అరికట్టాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా జాయింట్ సెక్రటరీ అతిక్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 (ఎన్ఈపీ 2020) విద్యారంగాన్ని ప్రైవేటీకరణ, వాణిజ్యవాద దిశగా నడిపిస్తోందని ఆరోపించారు. యూజీసీ సమానత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, ఉన్నత విద్యాసంస్థల్లో కులవివక్షను అరికట్టేందుకు రోహిత్ వేముల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయ, లౌకిక, సమానత్వ విద్యావిధానం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, హాస్టళ్ల బకాయిలను విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.8 వేల కోట్ల పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు జయరాజు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక, రాజకీయ పరిణామాలపై అవగాహన పెంచుకొని, విద్యా హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ మహాసభల్లో జిల్లా అధ్యక్షుడు మహేష్, జిల్లా కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు అర్జున్, సతీష్, పావని, విష్ణు, జిల్లా కమిటీ సభ్యులు శంకర్, హరీష్, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు. మహాసభలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

# దేవాదుల మోటర్లు ఎందుకు ఆగిపోయాయి

**- పంటుల ఎండుతున్నా ఎందుకు పట్టించుకోరు**

**- రైతుభరోసాపై ఇంకా తాత్సారం ఎందుకు**

**- దేవాదుల పంప్‌హౌజ్ వద్ద మీడియాతో హరీష్ రావు**

**వరంగల్,ఫిబ్రవరి 20 ( వెలుతురు):**
అన్నదాతల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. రైతులపై పగబట్టారా..? అంటూ ఫైర్ అయ్యారు. కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో హరీశ్‌రావు శుక్రవారం పర్యటించారు. దేవన్నపేట పంప్‌హౌస్ దగ్గర దేవాదుల మోటార్లని పరిశీలించాక మీడియాతో మాట్లాడారు. మోటార్లు ఎందుకు ఆగాయంటూ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరిలో నీరు వృథాగా పోతున్నా... దేవన్నపేటలో మూడు మోటార్లు పది రోజులుగా ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో మంత్రులు వచ్చి మోటార్లు ప్రారంభిస్తామని చెప్పి.. చివరకు ప్రారంభించకుండా వెళ్లారని దుయ్యబట్టారు. రైతులపై పగబట్టారా..?, కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు 60వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. దేవాదుల ప్రాజెక్టులో అతి పొడవైన, లోతైన పంప్ హౌస్ దేవన్నపేట అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే దేవాదుల థర్డ్ ఫేస్ పూర్తి చేశామని హరీశ్‌రావు ప్రస్తావించారు. నాడు దేవాదులపై కాంగ్రెస్ చిన్నచూపు చూస్తే... కేసీఆర్



అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పూర్తి చేశారని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో దేవాదుల ఆయకట్టును 3లక్షల 17వేల ఎకరాలకు పెంచామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్.. వరంగల్ జిల్లా రైతాంగం నోరుకొడుతోందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో దేవాదులపై రూ.7,300 కోట్లు ఖర్చు చేశామని, 80శాతం ప్రాజెక్టు పూర్తి చేశామని చెప్పుకొచ్చారు. 2026 మార్చి కల్లా దేవాదుల పూర్తి చేస్తామని మంత్రులు చెప్పారని... ఇప్పటికీ పైసా పని కూడా చేయలేదని నిలదీశారు. పెద్ద పెద్ద డైలాగులు కొట్టిన మంత్రులు ఎక్కడికి పోయారని హరీశ్‌రావు నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా నిలిస్తే కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఏమీ పట్టనట్టుగా ఉంటోందని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తమ హయాంలో దేవాదుల ప్రాజెక్టు మీద రూ.7,300 కోట్లు ఖర్చు పెట్టి 80 శాతం పనులు పూర్తి చేశామని పేర్కొన్న ఆయన రేవంత్ ప్రభుత్వం కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడ్డారు. 'కేసీఆర్ పాలనలో మేము దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యమిచ్చాం. రూ.7.300 కోట్ల ఖర్చుతో 47 వేలు ఉన్న ఆయకట్టును, 3 లక్షల 17 వేల ఎకరాలకు పెంచాం. మరో 33 వేల ఎకరాలు ఈ ప్రాజెక్టుకు అవసరమవ్వగా.. 30 వేల ఎకరాలు భూసేకరణ కూడా పూర్తి చేశాం. ఇంకొక 3వేల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. దాదాపు రూ.1,000 నుండి రూ.2,000 కోట్లు ఖర్చు పెడితే ఇంకో 2,40,000 ఎకరాల ఆయకట్టు సృష్టించవచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నర ఏండ్లలో కనీసం రూ.100 కోట్లు కూడా ఖర్చు చేయలేదని కాంగ్రెస్‌పై హరీష్ రావు విరుచుకుపడ్డారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన 'రైతు బంధు' నిధులను ఇంకా విడుదల చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఆయన రైతు బంధు ఎప్పుడిస్తారు? అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. 'మున్సిపల్ ఎన్నికల కోడ్ అయిపోగానే 17వ తేదీన రైతుబంధు ఇస్తా అన్నాడు, 20వ తేదీ వచ్చింది. అయినా ఇంకా రైతుబంధు రాలేదు. రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇస్తారా?.. కోతలు జరిగేటప్పుడు ఇస్తారా?' అని రేవంత్‌ను హరీశ్ సూటిగా ప్రశ్నించారు. 'ఇప్పటికే రెండు పంటలకు రైతు బంధు వేయలేదు, ఈ సారి అయినా వేస్తారా లేదా? బడా కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్ల కోసం రూ.20వేల కోట్ల బకాయిలు చెల్లించావు కానీ రైతులకు రైతుబంధు వేయడానికి డబ్బులు లేవా?' అని కాంగ్రెస్ సర్కార్ దాటవేత ధోరణిపై హరీష్ రావు ధ్వజమెత్తారు.

# లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుర్మార్గాలు

**- నెయ్యిలో జంతువుల కొవ్వు కలసిందని దుష్ప్రచారం**

**- మండలిలో చర్చకు ఎందుకు వెనక్కి పోయారు**

**- చంద్రబాబు లాగా షాస్ వేసుకుని ఫోటోలు పట్టుకోలే**

**- కూటమి నేతల తీరుపై మండిపడ్డ విపక్షనేత బొత్స**

**అమరావతి,ఫిబ్రవరి 20( వెలుతురు):**
చంద్రబాబు దేవదేవుడి ప్రసాదంపై నిందారోపణలు చేశారని.. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారానికి దిగారని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఆయన శాసన మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. తన



స్వలాభం కోసం తమ సంస్థలకు నెయ్యి టెండర్లు ఇప్పించుకోవడం కోసం అసత్యాలు చెప్పారన్నారు. సీబీఐ ఇచ్చిన రిపోర్టులో చాలా విషయాలు బయటికి వచ్చాయని.. హెరిటేజ్‌తో ఒప్పందం చేసుకున్న ఇందాపూర్ డెయిరీ నెయ్యిని సరఫరా చేసింది. 2015-19 మధ్య కల్తీ నెయ్యిని సరఫరా చేసినందుకు ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపారు. అవే ట్యాంకర్లను దాచి మళ్లీ వినియోగించారు. గోవిందా కూటమి నేతలకు ఇప్పటికైనా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరాం. సభలో చర్చించమని కోరామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సభలో టీడీపీ మంత్రులు అవాకులు, చవాకులు మాట్లాడారు. టీడీపీ నేతలకు కావాల్సింది స్వామివారి ఔన్నత్యం పెంచడం కాదు. కూటమి నేతలకు కావాల్సింది రాజకీయం. మీకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా చర్చకు రండి. చెప్పులు, బూట్లు వేసుకుని మేం దేవుడి ఫోటోలను పట్టుకుని ఉన్నట్లు నిరూపించండి. కెమెరాలు ఉన్నాయిగా మీకు వీలైతే ఆధారాలు చూపించండి. టీడీపీ నేతల వ్యాఖ్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. సభలో మేం ప్రదర్శించిన పేపర్లను నేనే స్వయంగా కలెక్ట్ చేసి టేబుల్ మీద పెట్టా. చంద్రబాబు లాగా మేం వేంకటేశ్వరస్వామి ఫోటోలను బూట్లు వేసుకుని పట్టుకోలేదు. వాళ్లలాగా మాది నీచబుద్ధి కాదు. దేవుడిని అవమానించారని ఊగిపోయిన జనసేన, బీజేపీ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు? చంద్రబాబు బూట్లు వేసుకుని దేవుడి ఫోటోను పట్టుకున్నది మీకు కనిపించడం లేదా?. మేం దేవుడి ఫోటోలను సభలో చెప్పులతో పట్టుకున్నట్లు నిరూపించండి. దేవుడి ఫోటోలను చించి, విసిరేశారని మాట్లాడుతున్నారు. మేం ఫోటోలను చించినట్లు రుజువు చేయండి. దేవుడిని రాజకీయాల్లోకి లాగింది చంద్రబాబు, పవన్, కూటమి నేతలు. దేనికి సభలో మంత్రులు ఊగిపోతున్నారని మండిపడ్డారు.

# ఘాట్ రోడ్డులో కారును ఢీకొన్న లారీ

**- ప్రమాదంలో ఏడుగురు వ్యక్తుల దుర్మరణం**

**అహ్మదాబాద్,ఫిబ్రవరి 20 ( వెలుతురు):**
ఘాట్ రోడ్డులో ఒక కారును లారీ ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ కారు ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. ఆ కారులో ప్రయాణించిన ఏడుగురు వ్యక్తులు ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. గుజరాత్‌లోని వాస్లాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో కర్పాడలోని కుంభ్‌ఘాట్ రోడ్డులో వేగంగా వెళ్తున్న కారును ఒక లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఆ కారు నుజ్జునుజ్జు అయ్యింది. కాగా, కారులో ప్రయాణించిన ఏడుగురిలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రికి తరలించగా మరో ఇద్దరు అక్కడ చనిపోయారు. మరణించిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. మరోవైపు మృతులను అంబా జంగిల్ గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. నానా పోండాకు కారులో వారు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# అదిలాబాద్ కు కొత్త ఎయిర్ పోర్టు



**అదిలాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):** ఆదిలాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుంది. జిల్లాలో కొత్తగా ఎయిర్‌పోర్టు కానుంది. ఈ మేరకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌ను ఎంపీ గోడం నగేష్ విడుదల చేశారు. త్వరలోనే భూసేకరణ పనులు ప్రారంభం అవుతాయని ఎంపీ వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మరికొన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ పనులు మె?దలయ్యాయి. తాజాగా.. ఆదిలాబాద్ విమానాశ్రయంపై కూడా కీలక అప్డేట్ వచ్చింది.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌కు అనుమతి వచ్చిందని ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. త్వరలో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్ ప్రతిని మీడియా ముందు విడుదల చేశారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మరో 10 వేల ఎకరాల గుర్తింపునకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు రంగంలోకి దిగాక.. మాస్టర్ ప్లాన్‌లో కొంత మార్పులు కూడా జరిగే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అనంతరం సోషల్ మీడియాలోనూ ఈ విషయాలను వెల్లడించారు.'ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందింది. జిల్లా ప్రజలకు ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి. దశాబ్దాలుగా ఈ ప్రాంతం ప్రజలు ఎయిర్ కనెక్టివిటీ కోసం ఎదురు చూస్తున్నారు. నేడు ఆ కల సాకారం కాబోతుంది. ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్‌ను ముందుకు తీసుకెళ్లాలనే ఆకాంక్ష నేడు కార్యరూపం దాల్చుతోంది. అధికారికంగా మాస్టర్ ప్లాన్ ఆమోదించారు. త్వరలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో ముందడుగు వేస్తోంది. మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వాటి ఫలితమే ఈ ముందడుగు.స్థానిక ప్రజల దీర్ఘకాల డిమాండ్‌ను నిజం చేయటం కోసం నిరంతర కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ విమానాశ్రయం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కంటే ఎక్కువ. ఇది ఆదిలాబాద్ జిల్లాకు ఒక మలుపు. మా జిల్లాను ప్రధాన నగరాలకు అనుసంధానిస్తుంది, స్థానిక వ్యాపారాలు, రైతులకు మద్దతు ఇస్తుంది, మా గిరిజన, అటవీ ప్రాంతాలకు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఆదిలాబాద్ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది.' అని గోడం నగేష్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

# అయోధ్య... ఆర్థిక అజెండా



**లక్నో, ఫిబ్రవరి20( వెలుతురు):** అయోధ్యలో రామమందిర నిర్మాణానికి వ్యతిరేకంగా గతంలో లౌకికవాదులు, మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేసేవి. 'గుడికి డబ్బులు వృథా, బదులు?ఆసుపత్రులు కట్టాలి' అని ప్రచారం చేశాయి. కానీ, మోదీ రామ మందిర సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు ఆలయం వృథా అన్న నోళ్లతోనే ఇప్పుడు శెభాష అనిపిస్తున్నారు. 2024 జనవరిలో ఆలయం పునఃప్రారంభించిన తర్వాత అయోధ్య ఆర్థిక పరిస్థితి మొత్తం మారిపోయింది. ఐఐఎం లక్నో 'ఎకనామిక్ రెనాసెన్స్ ఆఫ్ అయోధ్య' కేస్ స్టడీ రామ్ మందిర్ ప్రాంతీయ అభివృద్ధిని స్పష్టంగా ధ్రువీకరించిందిరామ మందిరం నిర్మానానికి ముందు అయోధ్యకు ఏటా 1.7 లక్షల మంది సందర్శకులు వచ్చేవారు. 2024 మొదటి ఆరు నెలల్లోనే 11 కోట్ల మంది అయోధ్యను సందర్శించారు. 2025 కుంభమేళాతో రికార్డు స్థాయిలు. 2025?26కు టూరిజం ఆదాయం రూ.10,000 కోట్లకు చేరనుంది. చుట్టుపక్కల తీర్థక్షేత్రాల సందర్శనలు కూడా పెరిగాయి.చిన్నచిన్న దుకాణాదారులకు ఇదివరకు రోజుకు రూ.500 ఆదాయం రాగా, ఇప్పుడు రూ.2,500 వస్తోంది. ఇక రియల్ ఎస్టేట్ విషయానికి వస్తే.. అమాంతం పెరిగింది. అయోధ్య పట్టణం నుంచి కేంద్రానికి రూ.400 కోట్ల జీఎస్టీ వస్తోంది. టూరిజం పరంగా చూస్తే 2025?26 కు సంబంధించిన అంచనా ప్రకారం.. రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. హోటల్ రూంల విషయానికి వస్తే 2024 వరకు 2 వేల హోటళ్లు ఉండగా, ఇప్పుడు 5 వేలకు పెరిగాయి. రెస్టారెంట్లు గతంలో 200 ఉండగా, ఇప్పుడు 2 వేలకు పెరిగాయి. పేదవాడికి సంబంధించిన రిక్షాల సంఖ్య గతంలో 500లు ఉండగా, ఇప్పుడు 17 వేలకు పెరిగింది, వస్త్ర దుకాణాలు గతంలో 150 ఉండగా ఇప్పుడు 500 లకు పెరిగాయి. హోం స్టేలు, ఇళ్లలో పేయింగ్ గెస్ట్‌గా ఉండే హోం స్టేల సంఖ్య 1136కు పెరిగింది. గతంలో ఒక్కటి కూడా ఉండేది కాదు.'గుడి వృథా' వాదనలు తప్పుగా ఉన్నాయి. మందిరం టూరిజం ద్వారా బడులు, ఆసుపత్రుల నిధులు సొంతంగా వస్తున్నాయి. స్థానికుల ఆదాయం 5 రెట్లు పెరిగింది. ఇది సాంస్కృతిక విశ్వాసాలు ఆర్థిక ప్రగతికి దారి తీస్తాయని నిరూపిస్తోంది.

# అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్

**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):** కేంద్ర ప్రభుత్వం రూ.18,000 కోట్ల వ్యయంతో దేశంలో తొలి అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్‌ను నిర్మించనుంది. అస్సాం రాష్ట్రంలో గోహ్పూర్ నుంచి నుమాలిగఢ్ వరకు దీన్ని నిర్మిస్తారు. ఈ 4 లేన్ యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ ప్రాజెక్టుకు రూ.18,662 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బ్రహ్మపుత్ర నది కింద రోడ్-రైల్ టన్నెల్ నిర్మిస్తారు.ప్రస్తుతం నుమాలిగఢ్ వద్ద నేషనల్ హైవే-715 నుంచి గోహ్పూర్ వద్ద నేషనల్ హైవే-15 వరకు దూరం 240 కిలోమీటర్లుగా ఉంది. ఈ మార్గం నేషనల్ హైవే-52పై సిల్ఘాట్ సమీపంలోని కాలియాభోంబోరా మీదుగా సాగుతుంది. ప్రయాణానికి 6 గంటలు పడుతుంది. ఈ మార్గం నుమాలిగఢ్, కాజిరంగా నేషనల్ పార్క్, బిస్వనాథ్ పట్టణం మీదుగా వెళ్తుంది.ప్రస్తుతం నుమాలిగఢ్ నుంచి గోహ్పూర్ వరకు దూరం 240 కిలోమీటర్లు. అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్ ప్రాజెక్ట్ పూర్తైతే దూరం 34 కిలోమీటర్లకు తగ్గుతుంది. అంటే మొత్తం తగ్గింపు సుమారు 206 కిలోమీటర్లు ఉంటుంది. ప్రయాణ సమయం కూడా సుమారు 6 గంటల నుంచి 20 నిమిషాలకు తగ్గుతుంది.క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ శనివారం 4 లేన్ యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీన్ని ఇంజినీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) మోడల్ ద్వారా అభివృద్ధి చేస్తారు.ఇది భారతదేశంలో తొలి అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్. ప్రపంచంలో రెండోది.

ఈ ప్రాజెక్ట్ అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ సహా ఈశాన్య రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనాన్ని అందిస్తుంది. సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుంది. లాజిస్టిక్స్ వ్యయం తగ్గుతుంది. సామాజిక-ఆర్థిక అభివృద్ధి వేగవంతం అవుతుంది. ఈ ప్రాజెక్ట్ అస్సాం రాష్ట్రంలోని ప్రధాన ఆర్థిక, సామాజిక, రవాణా కేంద్రాలకు నిరంతర అనుసంధానం అందిస్తుంది. అదనంగా మల్టీ-మోడల్ ఇంటిగ్రేషన్ బలపడుతుంది. 11 ఆర్థిక కేంద్రాలు, 3 సామాజిక కేంద్రాలు, 2 పర్యాటక కేంద్రాలు, 8 లాజిస్టిక్ కేంద్రాలతో అనుసంధానం ఏర్పడుతుంది. 4 ప్రధాన రైల్వే స్టేషన్లు, 2 విమానాశ్రయాలు, 2 ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్‌తో కనెక్టివిటీ మెరుగవుతుంది.ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అంటే దేశ అంతర్గత నదులు, జలమార్గాల ద్వారా జరిగే రవాణా వ్యవస్థ. ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఊతమిస్తుంది. ప్రధాన ఆర్థిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుంది. వాణిజ్యం, పరిశ్రమ అభివృద్ధికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయి.

# మళ్లీ తెరపైకి సెంటిమెంట్



**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):** తెలంగాణ రాజకీయాలు మరోసారి సెంటిమెంట్ చుట్టూ తిరుగుతున్నాయి. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని పాలించిన భారత్ రాష్ట్ర సమితి, ప్రస్తుతం అధికారాన్ని కోల్పోయిన తర్వాత మళ్ళీ పాత అస్త్రాన్నే నమ్ముకుందా? అంటే అవుననే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా మాజీ మంత్రి, ప్రస్తుత కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. కేసీఆర్ సెంటిమెంట్ రాజకీయాలపై ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి.కడియం శ్రీహరి ప్రధానంగా కేసీఆర్ సెంటిమెంట్ వైఖరిని తప్పుపట్టారు. తెలంగాణ సెంటిమెంట్ అనేది కేసీఆర్ సొత్తు కాదని స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో సెంటిమెంట్ ప్రజల ఆకాంక్ష అని, కానీ ఇప్పుడు అది కేవలం రాజకీయ మనుగడ కోసం వాడుకుంటున్న సాధనంగా మారిందని ఆయన ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు లేని సెంటిమెంట్, ఓడిపోయిన వెంటనే కేసీఆర్‌కు గుర్తుకు రావడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కంటే భావోద్వేగాల ద్వారానే పబ్బం గడుపుకోవాలని చూడటం సరికాదనేది శ్రీహరి వాదన. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ప్రతిసారీ సెంటిమెంట్ పేరుతో ఓట్లు అడగడం చెల్లదని ఆయన హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో 'తెలంగాణ ఆత్మగౌరవం' అనే అంశం బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్షగా నిలిచింది. అయితే, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 'మార్పు' నినాదంతో అధికారంలోకి రావడంతో, బీఆర్‌ఎస్ తన పట్టును కోల్పోయింది. అయితే అసెంబ్లీ ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా, చివరకు స్థానిక సంస్థల ఎన్నికలైనా కేసీఆర్ మళ్ళీ "తెలంగాణకు అన్యాయం జరుగుతోంది" లేదా "ఆంధ్ర పెత్తనం పెరుగుతోంది" అనే భావజాలాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని కడియం శ్రీహరి తప్పుబడుతున్నారువరుస ఓటములతో నిరాశలో ఉన్న పార్టీ శ్రేణులను ఏకం చేయడానికి బీఆర్‌ఎస్ ఇలాంటి ఎత్తుగడలు వేస్తోంది. తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి పక్కదారి మళ్ళించే వ్యూహం కూడా ఇందులో దాగి ఉంది. అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపే క్రమంలో సెంటిమెంట్‌ను జోడించి ప్రజల్లోకి వెళ్లడం ద్వారా లబ్ది పొందాలనేది వ్యూహంగా కనిపిస్తోంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా 'ప్రాంతీయ పార్టీయే రక్షణ' అనే భావనను బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశం.కడియం శ్రీహరి ఒకప్పుడు బీఆర్‌ఎస్‌లో కీలక నేతగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన ఆయుధంగా మారాయి. కడియం వంటి సీనియర్ దళిత నాయకుడు కేసీఆర్‌ను వ్యతిరేకించడం వల్ల, గతంలో బీఆర్‌ఎస్ వైపు ఉన్న సామాజిక వర్గాల్లో పునరాలోచన మొదలయ్యే అవకాశం ఉంది. కేసీఆర్ మాటలకు మునుపటి పదును లేదని, ఆయన మాటల్లో నిజాయితీ లేదని ప్రజలకు వివరించడంలో కడియం సఫలమవుతున్నారు.తెలంగాణ రాజకీయాల్లో సెంటిమెంట్ అనేది ఎప్పుడూ ఒక పదునైన కత్తి లాంటిది. అయితే, అభివృద్ధి, నిరుద్యోగం, సంక్షేమం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వస్తున్న ప్రస్తుత తరుణంలో, కేవలం సెంటిమెంట్‌తోనే గట్టెక్కడం బీఆర్‌ఎస్‌కు సవాలుతో కూడుకున్న పని. కడియం శ్రీహరి చేసిన ఘాటు విమర్శలు, కేసీఆర్ భవిష్యత్తు రాజకీయ వ్యూహాలను ఏ మేరకు ప్రభావితం చేస్తాయో చూడాలి. ప్రజలు ఇప్పుడు 'భావోద్వేగాల' కంటే 'ఫలితాల'కే ప్రాధాన్యత ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# హైదరాబాద్‌లో హాట్ కేకుల్లా ప్లాట్లు..

## 14 ప్లాట్ల వేలంతో రూ.14.75 కోట్ల ఆదాయం



**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):** హైదరాబాద్‌లో ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లకు నిర్వహించిన వేలంలో భారీ ధర పలికాయి. 14 ప్లాట్లను వేలం వేయగా.. ఏకంగా రూ.14.75 కోట్ల ఆదాయం సమకూరింది. చదరపు గజానికి కనీస ధర రూ.32 వేలు నిర్వహించగా.. గరిష్ఠంగా రూ.51 వేలకు విక్రయం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మరో విడత వేలం ఈనెల 23న నిర్వహించనున్నారు.శరవేగంగా డెవలప్ అవుతున్న హైదరాబాద్ మహా నగరంలో ఖాళీ ప్లాట్లు దొరకడమే గగనం అయిపోయింది. ప్లాట్లు కొనాలంటే నగర శివార్లకు వెళ్లాల్సిందే. అది కూడా భారీగా ధరలు పెట్టాల్సిందే. ఇక నగరం నడిబొడ్డున ప్లాట్లు కొనాలంటే కోట్ల రూపాయలు కుమ్మరించాల్సిందే. ఇక అప్పుడప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో స్థలాలు అత్యధిక పలికి రికార్డుల్లోకి ఎక్కిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఖాళీ ప్లాట్లకు నోటిఫికేషన్ విడుదల చేసి.. తాజాగా వేలం నిర్వహించగా.. కళ్లు చెదిరే ఆదాయం వచ్చింది.హైదరాబాద్ నగర శివారు అయిన రాజేంద్ర నగర్ మండలంలో ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించారు. లక్ష్మీగూడలోని హౌసింగ్ బోర్డు ప్లాట్లను అమ్మకానికి పెట్టగా.. భారీ ఎత్తున స్పందన వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్కడ ఉన్న 14 ప్లాట్లను తాజాగా బహిరంగ వేలం జరిపారు. ఈ ప్లాట్ల విక్రయించడానికి సంబంధించి ఈనెల 2వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది.బహిరంగ వేలం పాట నిర్వహించగా.. అందులో 49 మంది కొనుగోలుదారులు హాజరయ్యారు. మొదట ఈ భూములకు చదరపు గజానికి రూ.32 వేలను కనీస ధరగా హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఇక వేలంలో అనూహ్యంగా చదరపు గజం ధర గరిష్టంగా రూ.51 వేలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ క్రమంలోనే ఏకంగా 14 ప్లాట్ల హాట్ కేకుల్లా విక్రయం అయ్యాయి.ఈ ప్లాట్లను అమ్మడం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ వెల్లడించారు. హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ వేలాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక ఈ వేలంలో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలికింది. దీంతో సగటున ఒక్కో చదరపు గజం రూ.44,285కు విక్రయం అయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.మరోవైపు.. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలం వేయడానికి హౌసింగ్ బోర్డు ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. గచ్చిబౌలి, లింగంపల్లి, కూకట్‌పల్లి, చింతల్, కుత్బుల్లాపూర్, నిజాంపేట ప్రాంతాల్లో ఈ ప్లాట్లు ఉన్నట్లు వెల్లడించింది. భరత్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద 1106 గజాలు.. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో 266 గజాలు.. బౌరంపేటలో 2,600 గజాలు, చింతల్ హౌసింగ్ బోర్డు కాలనీలో 6 ప్లాట్లు.. గచ్చిబౌలి హౌసింగ్ బోర్డు కాలనీలో 3 ప్లాట్లు, నిజాంపేటలో ఒక ప్లాటు ఉందని తెలిపారు. ఈ స్థలాలకు ఈనెల 23వ తేదీన వేలం నిర్వహించనున్నట్టు వీపీ గౌతమ్ తెలిపారు. వేలం రోజు ఉదయం నాటికి డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

# అజారుద్దీన్‌కు పదవీ గండం



**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):** అనూహ్యంగా మంత్రి అయిన అజారుద్దీన్‌ను పదవీ గండం వెంటాడుతోంది. గతేడాది జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికే మూడున్నర నెలలు గడిచిపోయింది. కానీ అజార్ ఇప్పటివరకు అటు అసెంబ్లీకి కానీ..ఇటు మండలికి కానీ ఎన్నిక కాలేదు. ఆరు నెలల్లోపు ఏదో సభకు ఎన్నిక కాకపోతే ఆయన పదవి ఊస్ట్ అవడం పక్కా.దీంతో అజారుద్దీన్ విషయంపై కాంగ్రెస్ పెద్దలు పెద్ద కసరత్తే చేస్తున్నారట. అజారుద్దీన్‌ను పదవీ గండం నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ వేస్తున్నారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యూహాలకు పదును పెడుతున్నారట. ఈ దెబ్బతో ఇటు రాష్ట్రంలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ, త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి మార్గం సుగమమం కానున్నట్లు తెలుస్తోంది.అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచనలోనే మంత్రివర్గంలోకి తీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరి నియామకాన్ని సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.గత ఏడాది ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయలేదు. అయితే ఇంతలోపే అజారుద్దీన్ మంత్రిగా పదవి చేపట్టి ఆరు నెలుల పూర్తి అయ్యే పరిస్థితి వస్తుంది. దీంతో కొత్త ఫార్ములాకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్.వచ్చే ఏప్రిల్ 30 నాటికి అజారుద్దీన్ ఎమ్మెల్సీగానో లేదా ఎమ్మెల్యేగానో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. అలా చేయకుంటే మంత్రి పదవికి గండం తప్పదు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా శాసనసభకు ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఇక ఎమ్మెల్సీగానే ఎన్నిక కావాల్సి ఉంది. అయితే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉంది. ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా నియమించాలని క్యాబినెట్ నిర్ణయించినా సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో సస్పెన్స్ కొనసాగుతోంది. అజారుద్దీన్ను పదవీగండం నుంచి గట్టెక్కించేందుకు..రేవంత్ వ్యూహాన్ని రచిస్తున్నారట. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నవారిలో ఒకరి చేత రాజీనామా చేయించి వారి స్థానంలో అజారుద్దీన్ను మండలికి పంపించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీగా రాజీనామా చేయబోయే నేతకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసే అవకాశం ఉందట. అయితే అజారుద్దీన్ కోసం ఎమ్మెల్సీ సీటుకు రాజీనామా చేసే నేత ఎవరో.? రాజ్యసభకు వెళ్లేదెవరో.? వేచి చూడాలి.

# మైత్రీవనం కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**- సకాలంలో ఫైర్ సిబ్బంది రాకతో తప్పిన ముప్ప**

**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):** అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కాంప్లెక్స్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో పలువురు విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. నిచ్చెన సాయంతో 60 మందిని కిందికి దించారు. నీలగిరి బ్లాక్‌లోని షాపులను మూసివేయించారు. కోచింగ్ సెంటర్‌లోని విద్యార్థులను పంపించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. మూడు అంతస్తుల వరకు మంటలు వ్యాపించినట్లు పోలీసులు తెలిపారు. పై అంతస్తులోని కొన్ని ఐటీ సంస్థల్లో ఉన్న కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు మెట్ల మార్గం ద్వారా బయటకు వచ్చారు. మరికొందరిని అగ్నిమాపక సిబ్బంది బాల్కనీ ద్వారా, మెట్ల ద్వారా సురక్షితంగా కిందకు చేర్చారు. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. కొందరు కిందకు దూకేందుకు ప్రయత్నించగా వారిని అగ్నిమాపక సిబ్బంది కాపాడింది.

# మేడ్ ఇన్ ఇండియా గ్లాసెస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి20( వెలుతురు):**
భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వేగవంతమైన పురోగతి మధ్య, ఒక కొత్త, ఆసక్తికరమైన ఆవిష్కరణ ఉద్భవించింది. ఇటీవల, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇండియా భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వేగవంతమైన పురోగతి మధ్య, ఒక కొత్త, ఆసక్తికరమైన ఆవిష్కరణ ఉద్భవించింది. ఇటీవల, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో ఒక ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాసెస్ ధరించి కనిపించారు. సర్వమ్ కేజ్ అని పిలిచే ఈ గ్లాసెస్‌ను భారతీయ స్టార్టప్ సర్వమ్ ఏఐ అభివృద్ధి చేసింది. ఇవి సాధారణ గ్లాసెస్ కాదు, కానీ మానవుడిలా తక్షణమే వినగల, అర్థం చేసుకుని స్పందించగల స్మార్ట్ పరికరం. ఈ సాంకేతికత భవిష్యత్తులో మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారబోతోందని సూచిస్తుంది. సర్వం కేజ్ లాంటి స్మార్ట్ గ్లాసెస్ భవిష్యత్తులో మన జీవితాలను గణనీయంగా మార్చగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ సాంకేతికత ప్రజల పనిని సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. విద్యలో, విద్యార్థులు దీనిని నేర్చుకోవడానికి ఉపయోగించవచ్చు. ఆరోగ్య సంరక్షణలో, వైద్యులు రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయగలరు. వ్యాపారంలో, ఇది ప్రజలు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా, ఈ సాంకేతికత డిజిటల్, వాస్తవ ప్రపంచానికి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది. సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి మనకు ఇకపై ప్రత్యేక పరికరం అవసరం లేదు, బదులుగా, అదే పరికరం అన్ని సమయాల్లో మనతో ఉంటుంది. ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో ఒక ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాసెస్ ధరించి కనిపించారు. సర్వమ్ కేజ్ అని పిలిచే ఈ గ్లాసెస్‌ను భారతీయ స్టార్టప్ సర్వమ్ ఏఐ అభివృద్ధి చేసింది. ఇవి సాధారణ గ్లాసెస్ కాదు, కానీ మానవుడిలా తక్షణమే వినగల, అర్థం చేసుకుని స్పందించగల స్మార్ట్ పరికరం. ఈ సాంకేతికత భవిష్యత్తులో ఏఐ మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారబోతోందని సూచిస్తుంది.సర్వమ్ కేజ్ అనేది ఏఐ-ఆధారిత స్మార్ట్‌గ్లాస్, దీనిని ధరించినప్పుడు, వినియోగదారునికి వ్యక్తిగత డిజిటల్ అసిస్టెంట్ ఉన్న అనుభవాన్ని అందిస్తుంది. ఈ పరికరం నిజ సమయంలో పనిచేస్తుంది. అంటే మీరు ఏమి చూస్తున్నారో లేదా చెబుతున్నారో అది తక్షణమే అర్థం చేసుకుంటుంది, ప్రతిస్పందిస్తుంది. ఇప్పటివరకు మం మొబైల్ ఫోన్లు లేదా కంప్యూటర్ల ద్వారా ఏఐని ఉపయోగించాము. కానీ ఈ గ్లాసెస్ ఏఐని నేరుగా మన కళ్ళకు తీసుకువస్తున్నాయి. ఇది నిరంతరం స్క్రీన్‌ను చూడవలసిన అవసరాన్ని తొలగిస్తుంది, ఇది మన పనిని చాలా సులభతరం చేస్తుందంటున్నారు నిపుణులు.న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా ఇండియన్ ఏఐ స్టార్టప్ సర్వమ్ ఏఐ తన రాబోయే స్మార్ట్‌గ్లాసెస్ సర్వమ్ కేజ్ గురించి వివరించారు. కంపెనీ సహ వ్యవస్థాపకుడు ప్రత్యూష్ కుమార్ ఈ పరికరం ఏఐని నేరుగా రోజువారీ జీవితంలోకి తీసుకురావడానికి రూపొందించినట్లు ఒక టీజర్ వీడియోను విడుదల చేశారు. ఈ స్మార్ట్‌గ్లాసెస్ ధరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోను కూడా వేదికపై షేర్ చేశారు. కంపెనీ ప్రకారం, ప్రధానమంత్రి మొదట వాటిని ప్రయత్నించారు.సర్వమ్





కేజ్‌అతిపెద్ద బలం దాని స్మార్ట్ ఫీచర్లలో ఉంది. ఇవి సాధారణ గాడ్జెట్‌ల నుండి వేరు చేస్తాయి. ఇది మీ ముందు ఉన్న దాన్ని చూడగల చిన్న కెమెరాను కలిగి ఉంటుంది. ఇది రికార్డ్ చేయడమే కాకుండా, ఏఐతో అర్థం చేసుకుని ప్రతిస్పందిస్తుంది. మీరు ఏదైనా అడిగితే, ఈ గ్లాసెస్ తక్షణమే సమాచారాన్ని అందించగలవు. మరో ప్రత్యేకత ఏమిటంటే ఇది పూర్తిగా వాయిస్ ద్వారా పని చేస్తుంది. మీరు ఏ బటన్లను నొక్కాల్సిన అవసరం లేదు. ఇది మీరు చెప్పేది అర్థం చేసుకుంటుంది. దానికి అనుగుణంగా స్పందిస్తుంది. ఇది ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం అంతగా తెలియని వారికి ఉపయోగించడం చాలా సులభం చేస్తుంది.మరో ముఖ్యమైన లక్షణం రియల్-టైమ్ ప్రతిస్పందన. దీని అర్థం మీరు ఏ ప్రశ్నకైనా తక్షణ ప్రతిస్పందనను పొందుతారు. మీరు దిశలను అడిగినా లేదా సమాచారం అవసరమైనా, ప్రతిదీ ఆలస్యం లేకుండా సహాయపడుతుంది. అదనంగా, ఈ గ్లాసెస్ ఫోటోలు, వీడియోలను కూడా రికార్డ్ చేయగలవు. మీరు మీ ఫోన్‌ను బయటకు తీయవలసిన అవసరం లేదు. మీరు చూస్తున్న వాటిని నేరుగా రికార్డ్ చేయవచ్చు. ఈ ఫీచర్ ముఖ్యంగా ప్రయాణించే లేదా కంటెంట్‌ను సృష్టించే వారికి ఉపయోగపడుతుంది.మరో ప్రత్యేక లక్షణం ఏమిటంటే దీనికి స్క్రీన్ అవసరం లేదు. ఇది ఆడియో ద్వారా సమాచారాన్ని అందిస్తుంది, మీ దృష్టిని, మీ పరిసరాలను కేంద్రీకరించి ఉంచుతుంది. ముఖ్యంగా, ఈ పరికరం భారతీయ భాషల కోసం కూడా అభివృద్ధి చేయడం జరుగుతోంది. దీని అర్థం ఇది హిందీ సహా ఇతర భాషలలో పనిచేయగలదు. ఇది భారత్ వంటి దేశానికి చాలా ముఖ్యమైనది.భారత్ మండపంలో జరిగిన ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ స్మార్ట్ గ్లాసెస్ ధరించి వాటి గురించి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మోదీ కొత్త టెక్నాలజీని ఉపయోగించినప్పుడు, అది దాని ప్రాముఖ్యతను ప్రదర్శించింది. భారతదేశంలో అభివృద్ధి చేసిన టెక్నాలజీలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, స్వావలంబన కోసం కృషి చేస్తోందని ఇది సూచిస్తుంది. సర్వం ఏఐ వ్యవస్థాపకుడు దీనిని ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు.సర్వమ్ ఈ స్మార్ట్ గ్లాసెస్‌ను అభివృద్ధి చేయడమే కాకుండా, అనేక రంగాలలో కూడా పనిచేస్తోంది. ఈ కంపెనీ భారతీయ భాషల కోసం స్పీచ్ మోడల్‌లను అభివృద్ధి చేస్తోంది. అదనంగా, ఇది డాక్యుమెంట్లను డిజిటలైజ్ చేయడంలో సహాయపడే సర్వమ్ అక్షర్, వివిధ భాషలలో కంటెంట్‌ను సృష్టించడంలో సహాయపడే సర్వమ్ స్టూడియో వంటి ఇతర ఉత్పత్తులను అభివృద్ధి చేసింది. సారస్ అనే స్పీచ్ మోడల్ కూడా అభివృద్ధి చేయడం జరిగింది. ఇది స్వరాలను బాగా గుర్తించగలదు. ఇవన్నీ భారతదేశం కోసం ప్రత్యేకంగా దాని ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.భారత ప్రభుత్వం ఏఐని ప్రోత్సహించడానికి మిషన్‌ను ప్రారంభించింది. ఈ మిషన్ కింద వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతున్నారు. దేశంలో ఏఐ పరిశోధనను బలోపేతం చేయడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. ఈ మిషన్ కింద, భారతీయ భాషా ఆధారిత ఏఐ నమూనాలను అభివృద్ధి చేయడానికి అనేక బృందాలను ఎంపిక చేశారు. పరిశోధన, అభివృద్ధిని వేగవంతం చేయడానికి వేలాది ఉఖజ లు కూడా అందుబాటులో ఉంచారు. సర్వం కేజ్ వంటి ఉత్పత్తులను ఈ మిషన్‌లో భాగంగా పరిగణించవచ్చు, భారతదేశం ఇప్పుడు ఏఐ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఇది నిరూపిస్తుంది.సర్వం కేజ్ లాంటి స్మార్ట్ గ్లాసెస్ భవిష్యత్తులో మన జీవితాలను గణనీయంగా మార్చగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ సాంకేతికత ప్రజల పనిని సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. విద్యలో, విద్యార్థులు దీనిని నేర్చుకోవడానికి ఉపయోగించవచ్చు. ఆరోగ్య సంరక్షణలో, వైద్యులు రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయగలరు. వ్యాపారంలో, ఇది ప్రజలు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా, ఈ సాంకేతికత డిజిటల్, వాస్తవ ప్రపంచానికి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది. సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి మనకు ఇకపై ప్రత్యేక పరికరం అవసరం లేదు, బదులుగా, అదే పరికరం అన్ని సమయాల్లో మనతో ఉంటుంది.

## పోలీస్ క్రీడలు ప్రారంభించిన మంత్రి అనిత

**- పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని వెల్లడి**



**అమరావతి, ఫిబ్రవరి20( వెలుతురు):**
అమరావతిలోని మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీఎస్పీ వేదికగా జరిగిన రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజా భద్రత కోసం 24 గంటలు శ్రమించే మన పోలీసు సోదరులకు మానసిక ఉల్లాసం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమారు 6 రాష్ట్రాల నుండి వచ్చిన 10 జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్న తరుణంలో, ఇలాంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు ఇక్కడ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది.

## గోదావరి పుష్కరాలకు భారీగా ఏర్పాట్లు

**- నది కాలుష్యం కాకుండా కాపాడుతాం**

**- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**



**అమరావతి, ఫిబ్రవరి20( వెలుతురు):**
ఏపీ అసెంబ్లీ సమావేశాలుఏడో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. గోదావరి పుష్కరాల సందర్భంగా నది కాలుష్యం జరగకుండా తీసుకునే చర్యలపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పుష్కరాల్లో నది పవిత్రతను కాపాడటం సహా కాలుష్యాన్ని నియంత్రించేలా ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందని అన్నారు. డ్రైయిన్లతో పాటు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల నదికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. భక్తుల రద్దీ పెరిగే అంచనాతో స్నాన ఘట్టాల సంఖ్యను పెంచామని వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో నది కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనలను కూడా పాటిస్తామని తెలిపారు. గోదావరి నది పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కొన్ని చోట్ల జంతు కళేబరాలు, పౌల్ట్రీ వ్యర్థాలను నీటి వనరుల్లో కలిపేస్తున్నారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నిమ్మల రామానాయుడు అభిప్రాయపడ్డారు.

## పబ్జీ ఆడే జగన్‌కు క్రికెట్ గురించి ఏం తెలుసు

**- హోంమంత్రి అనిత ఘాటు వ్యాఖ్యలు**



**అమరావతి, ఫిబ్రవరి20( వెలుతురు):**
ఏపీ హోం మంత్రి అనిత అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. 'గణతంత్ర దినోత్సవం, స్వాతంత్య్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగరేయకుండా.. ప్యాలెస్‌లో పబ్జీ ఆడేవాళ్లకు క్రికెట్ మ్యాచ్ టీవీలో చూస్తే సరిపోతుందనే ఆలోచనలే వస్తాయి. భారత్ – పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అంటే ప్రతీ భారతీయుడు ఇండియా గెలవాలని కోరుకుంటాడు. టీమ్ ఇండియాను ప్రోత్సహించి, ఆ గెలుపులో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలనుకుంటారు. దేశ భక్తి, దేశం పట్ల గౌరవం ఉన్న ఎవరికైనా ఇది అర్థమవుతుంది. మంత్రి లోకేశ్ సొంత ఖర్చులతో మ్యాచ్ చూసేందుకు కొలొంబో వెళ్లారు. దేశాన్నే కించపరిచే జగన్‌కు దేశభక్తి గురించి చెప్పినా అర్థం కాదు' అని అనిత మండిపడ్డారు. ఆ రోజు ప్రజలంతా టీమ్ఇండియా గెలుపు చూస్తే.. వైకాపా వాళ్లు మాత్రమే లోకేశ్ విషయంలో తప్పులు చూశారని విమర్శించారు. ప్రజలు మాత్రం లోకేశ్‌లో దేశభక్తిని చూశారని పేర్కొన్నారు.

## బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు

**- 10కోట్లు డిమాండ్ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్**



**ముంబై, ఫిబ్రవరి20( వెలుతురు):**
బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు వచ్చాయి. 10 కోట్లు ఇవ్వాలని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపు వచ్చినట్లు తెలుస్తోంది.అమెరికాలో రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్ నుంచి వాయిస్ నోట్ రూపంలో బెదిరింపు వచ్చిందని ఓ మీడియా కథనం పేర్కొన్నది. ఈ కేసులో ముంబై పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. క్రైం బ్రాంచ్ నేతృత్వంలో దర్యాప్తు మొదలైంది. నెంబర్ ఎక్కడిదో కనుక్కొనేందుకు అమెరికా భద్రతా సిబ్బందితో పోలీసులు టచ్‌లో ఉన్నారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించే పనిలోపడ్డారు. సాంకేతిక ఆధారాల కోసం అధికారులు వెతుకుతున్నారు. కాల్ డేటా రికార్డులు, డిజిటల్ ఆనవాళ్లను పరిశీలిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తగా బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్‌కు భద్రతను పెంచనున్నారు. గతంలో కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడింది. ఆ గ్యాంగ్ అనేక మంది సెలబ్రిటీలను బెదిరించిన దాఖలు ఉన్నాయి.

## కవిత పార్టీ టీపీజేపీ ?

**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):**
ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు. ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది. కవిత తన పార్టీ పేరును ౹ఖఏఖ గా నిర్ణయించినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం చేసినట్లుగా సమాచారం. తన పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పిన కవిత.. అన్నట్లుగానే ఇప్పుడున్న తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చేస్తూ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నిర్ణయించారని తెలుస్తోంది. కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో



నడుస్తున్న చర్చ.ఇక పార్టీ గుర్తుగా కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై కవిత ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేట, బోధన్.. ఈ రెండు చోట్ల నుంచి కవిత బరిలోకి దిగుతారనే టాక్ వినిపిస్తోంది.ఆర్టీసి కార్మికుల సమ్మె విషయంలో బీఆర్ఎస్ పట్టించుకోలేదనే కోపం కార్మికుల్లో ఉంది. బిల్లుల చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నయం. రెండేళ్లలో ఆర్టీసీలో సింగిల్ పర్మినెంట్ రిక్రూట్మెంట్ లేదని కవిత అన్నారు. ఫ్యూచర్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉండదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షం మేమే అవుతాం.. చూస్తూ ఉండండి అంటూ కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి మేమే వస్తామని, ప్రయారిటీల ఆధారంగా మేము సమస్యలపై పోరాటం చేస్తున్నామని కవిత చెప్పుకొచ్చారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు మున్సిపాలిటీల్లో గెలిచిన తరువాత వాళ్లకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తుంది. కొత్త తరహా రాజకీయం కాంగ్రెస్ చేయడం లేదని కవిత అన్నారు.నేను పెట్టబోయే పార్టీ వ్యక్తుల మీద నడవదు.. వ్యవస్థల మీద నడవాలి. ప్రాంతీయ పార్టీ లీడర్ సెంట్రిక్ ఉంటుంది. కానీ, వ్యవస్థ నిర్మాణం జరగాలి. సైద్ధాంతిక పునాది ఉండాలని.. ఆ మేరకు పార్టీ నిర్మాణం ఉంటుందని కవిత చెప్పారు.ఆడవాళ్లు అని అవమానించొద్దు. షర్మిల ఈరోజు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడ ప్రజలకు నచ్చలేదు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా..? నా లైన్లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. తెలంగాణ వాదమే మా పార్టీ మొదటి లైన్ అని కవిత స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లు కేంద్ర మంత్రులు అయ్యారు. కొత్త తరానికి పెట్టబోయే పార్టీలో అవకాశం ఉంటుందని కవిత చెప్పారు

# కార్పొరేషన్ విభజనపై నోటీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి20( వెలుతురు):**
జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని పేర్కొంటూ ఓ వ్యక్తి.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేశారు. జనగణన ముగిసేవరకు జీహెచ్ఎంసీ విభజనపై స్టే ఇవ్వాలని పిటిషనర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇస్తూ విచారణను వాయిదా వేసింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జీహెచ్ఎంసీ )ని విభజించి 3 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ.. ఇటీవలె రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో జీహెచ్ఎంసీతోపాటు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లను కొత్తగా ఏర్పాటు చేసింది. అయితే ఈ విభజనకు వ్యతిరేకంగా హైదరాబాద్‌కు చెందిన గురువారెడ్డి అనే బిజినెస్‌మెన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు




విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని.. దీనిపై స్టే విధించాలని కోరారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవలె జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ జీవో నంబర్ 55 జారీ చేసింది. ఈ జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ గురువారెడ్డి హైకోర్టుకెక్కారు. కేంద్ర ప్రభుత్వం 2027లో జనాభా లెక్కలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలోనే ఈ జనాభా లెక్కలకు సంబంధించి కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు ఈ జీహెచ్ఎంసీ విభజన విరుద్ధమని పిటిషనర్ వాదించారు. అదే సమయంలో దేశంలో జనగణన పూర్తి అయ్యే వరకు ఈ జీవో నంబర్ 55పై స్టే విధించాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.జనగణన పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీని విభజించకుండా ఇంతకుముందు ఎలా ఉందో అలాగే యథావిధిగా ఉంచాలని హైకోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. అటు కేంద్ర ప్రభుత్వంతోపాటు.. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ చేసింది. ఈ జీహెచ్ఎంసీ విభజనకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై తర్వాతి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయం వెల్లడించింది

## ముంబైలో ఉండి.. చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా

### కపుల్ ఫ్రెండ్లీ మరో గీతాంజలి అంటూ ప్రభాస్ కితాబు




నటుడు ప్రభాస్ ఫుడ్ లవర్...ఆయన వెరైటీ ఫుడ్ ఇష్టపడతారు. అందరికీ నా ఫుడ్ గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మీకో ఆసక్తికర విషయం చెబుతాను. నేను అప్పుడప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెడతాను. 'ఆదిపురుష్' షూటింగ్ ముంబయిలో జరిగేటప్పుడు చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా. టీమ్ అందరూ షాక్ అయ్యారు. ఫ్లైట్‌లో ఆర్డర్ తీసుకొచ్చిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి మీరు మాములు వాళ్లు కాదండీ' అంటూ చేసిన కామెంట్స్‌ను ప్రభాస్ గుర్తుచేసుకున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' చూసి ఆ ఫీల్ నుంచి బయటకు రావడానికి చాలాసేపు పట్టిందని అగ్రనటుడు ప్రభాస్ అన్నారు. చివరి 20 నిమిషాలు మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. తాజాగా ఈ మూవీ టీమ్ ప్రభాస్‌ను కలిసింది. ఆ చిత్ర బృందంతో ప్రభాస్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయవాడ పునుగులు అంటే తనకు ఇష్టమని చెప్పారు. నేను అభిమానుల కోసం సంవత్సరానికి మూడు, నాలుగు సినిమాల్లో నటిస్తున్నాను. కానీ, ఒక్కటే విడుదలవుతోంది. నాకు 'గీతాంజలి' అంటే చాలా ఇష్టం. అందరూ నాకు యాక్షన్ చిత్రాలంటే ఇష్టమనుకుంటారు. నాకు అన్ని జానర్‌ల పైనా ఆసక్తి ఉంది. ప్రత్యేకించి మణిరత్నం అభిమానిని అంటూ 'కపుల్ ఫ్రెండ్లీ' చూసినప్పుడు నాకు 'గీతాంజలి' చూస్తున్న ఫీల్ కలిగింది. అందుకే నాలుగు సార్లు చూడాలని నిర్ణయించుకున్నానన్నారు. పూరి జగన్నాథ్‌లా ఎవరూ రాయలేరు. ఆయన 'బుజ్జిగాడు' కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఎలా చేయాలి అని టెన్షన్ వచ్చింది. తర్వాత ఆయన దర్శకత్వంలో 'ఏక్ నిరంజన్' చేశా. ఆయనలా డైలాగులు రాసేవాళ్లు ప్రపంచంలోనే లేరు. ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. నా సినిమాల్లో కాస్ట్యూమ్స్ కూడా డిఫరెంట్‌గా ఉండేలా చూస్తాను అన్నారు. మీ దృష్టిలో ప్రేమంటే ఏంటి?' అని హీరోయిన్ మానస వారణాసి అడగ్గా.. పర్సనల్ క్వశ్చన్ కదా అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. లవ్ అనగానే ప్రస్తుతానికి 'కపుల్ ఫ్రెండ్లీ' గుర్తొస్తుందన్నారు. ఈ సినిమా చూశాక ప్రేమలో పడాలని ఉందన్నారు. హీరో సంతోశ్ శోభన్ అడిగిన వెంటనే.. అతడికి ఫోన్ నంబరు ఇచ్చారు. ఈ మూవీ బ్యాక్‌డ్రాప్ గురించి ప్రభాస్ మాట్లాడుతూ.. చెన్నైలో తాను గడిపిన రోజులు గుర్తుచేసుకున్నారు. ప్రభాస్‌కు హిట్ ఇచ్చిన 'వర్షం' డైరెక్టర్ శోభన్ తనయుడే ఈ సంతోశ్.


## డాటర్ ఆఫ్ ప్రసాదరావు ట్రైలర్ విడుదల

రాజీవ్ కనకాల, ఉదయభాను, వసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు'. త్వరలోనే ఈ మూవీ విడుదల కాబోతోంది. 'రెక్కీ', 'విరాటపాలెం' మేకర్స్ నుంచి రాబోతోన్న మరో ఆసక్తికర థ్రిల్లర్ మూవీ ఇది. కృష్ణ పోలూరు దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు.




## ఉస్తాద్ నుంచి 22న మరో సాంగ్ విడుదల

గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ – డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ ఉస్తాద్' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.




## కామెడీ ట్రాక్‌లో హే బలవంత్..



ప్రేక్షకులను అలరిస్తే చాలు పెద్ద స్టార్ కాస్ట్ లేకపోయినా చిన్న సినిమాలు కూడా థియేటర్లలో రాణిస్తాయి. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాలే దానికి నిదర్శనం. ఆ సినిమాలను విడుదల చేసిన బన్నీ వాస్, వంశీ నందిపాటి మరోసారి కలిసి సుహాస్ నటించిన 'హే బల్‌వంత్' చిత్రాన్ని తీసుకొచ్చారు. సీక్రెట్ బిజినెస్ కాన్సెప్ట్‌తో చేసిన ప్రమోషన్స్ ఈ సినిమాపై ఆసక్తిని పెంచాయి. కృష్ణ (సుహాస్) చిన్నప్పటి నుంచే తండ్రి బల్‌వంత్ (నరేష్) చేస్తున్న బిజినెస్ చేయాలని నిర్ణయించుకుంటాడు. కానీ ఆ వ్యాపారం ఏమిటో అతనికి తెలియదు. దాన్ని దాచేందుకు బలవంత్ అతడిని బోర్డింగ్ స్కూల్‌లో పెడతాడు. చదువు పూర్తయ్యాక ఇంటికి వచ్చిన కృష్ణ, అనారోగ్యానికి గురైన తండ్రి స్థానంలో బిజినెస్ బాధ్యతలు తీసుకోవడానికి ఆఫీస్‌కు వెళ్తాడు. ఆ వ్యాపారాన్ని కళ్లారా చూసిన అతనికి పెద్ద షాక్ ఎదురవుతుంది. ఇంతకీ ఆ బిజినెస్ ఏమిటి? ఆ వ్యాపారం అతని ప్రేమ, తండ్రితో ఉన్న బంధాలపై ఎలాంటి ప్రభావం చూపిందనేదే కథ.నవ్విస్తూనే మనసులను హత్తుకునే కథ చెప్పాలనే ప్రయత్నం చేశాడు దర్శకుడు గోపి అచ్చర. ఈ ప్రయత్నం చాలా వరకు సక్సెస్ అయ్యింది. ఫస్ట్ హాఫ్‌లో సీక్రెట్ బిజినెస్ కామెడీ బాగా వర్క్ అవుతుంది. కృష్ణ బిజినెస్ ఐడియాలు, లవ్ ట్రాక్ సరదాగా సాగుతాయి. ఇంటర్వెల్‌కు ముందు వచ్చే ప్రకృతి వైద్యం ఎపిసోడ్ మంచి నవ్వులు పంచుతుంది. సుహాస్, సుదర్శన్, వెన్నెల కిశోర్ కలిసి చేసిన కామెడీ ట్రాక్ హైలెట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ ట్విస్ట్ కథపై ఆసక్తిని మరింత పెంచుతుంది. సీక్రెట్ బిజినెస్ నేపథ్యంతో సాగిన కథ సెకండ్ హాఫ్‌లో కిడ్నాప్ డ్రామా వైపు మళ్లుతుంది. ÷న్నెల కిశోర్ లవ్ ట్రాక్, అజయ్ ఘోష్ ఇంట్లో జరిగే సన్నివేశాలు వినోదాన్ని అందిస్తాయి. డెడ్ బాడీ చుట్టూ నడిచే ఎపిసోడ్ ఇంకా బెటర్ గా వుండాల్సింది. చివరి ఇరవై నిమిషాల్లో తండ్రి–కొడుకుల భావోద్వేగాన్ని బలంగా చూపించాలనే ప్రయత్నం ఆకట్టుకునేలా ఉంటుంది. సుహాస్ తనకు సూటయ్యే పాత్రలో మరోసారి మెప్పించాడు. కామెడీతో పాటు ఎమోషన్ సీన్స్‌లో కూడా ఆకట్టుకున్నాడు. శివానీ నాగారం మిత్ర పాత్రలో ఉత్సాహంగా కనిపించింది. నరేష్‌కు ఇచ్చిన ఎలివేషన్ సన్నివేశాలు వినోదంగా ఉంటాయి. సుదర్శన్ కామెడీ టైమింగ్ బాగా వర్క్ అయ్యింది. వెన్నెల కిశోర్, హర్ష వర్ధన్, అజయ్ ఘోష్ పాత్రలు కథకు వినోదాన్ని జోడించాయి. వివేక్ సాగర్ సంగీతంలో పాటలు అంతగా గుర్తుండకపోయినా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొన్ని సన్నివేశాలకు బలం ఇచ్చింది. సినిమాటోగ్రఫీ డీసెంట్‌గా ఉంది. ఎడిటింగ్ పదునుగానే వుంది. కథకు తగ్గ నిర్మాణ విలువలు కనిపించాయి.

## యశ్ టాక్సిక్ టీజర్ విడుదల

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) ఫిబ్రవరి 20:** యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. 'ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజెబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా, మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. విరోధం పెట్టుకొని బతకలేవు.. పట్టుదల వదిలేయ్ అనే డైలాగులతో మోస్ట్ వైలెంట్‌గా రాయాపాత్రలో యశ్ కనిపించారు.




## నేను రెడీకి గుమ్మడి కాయ కొట్టేశారు...



యంగ్ హీరో హవిష్ , డైరెక్టర్ త్రినాధ రావు నక్కిన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'నేను రెడీ'. ఈ సినిమాను హవిష్ సోదరి నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్యా థాపర్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ గురువారంతో పూర్తయ్యింది. రామోజీ ఫిల్మ్ సిటీలో క్లయిమాక్స్ చిత్రీకరణతో సినిమా పూర్తయ్యిందని, గుమ్మడికాయ కొట్టేసి, కేక్ కట్ చేశామని మేకర్స్ తెలిపారు. సినిమా చాలా బాగా వచ్చిందని, శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసి ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చెప్పారు. హవిష్ కెరీర్‌లో తొలి ఎంటర్ టైన్ మెంట్ మూవీ ఇదేనని, అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుందని హామీ ఇచ్చారు. బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, శ్రీలక్ష్మి, జిటివి గణేష్, రోహిణి, హరితేజ, మణిచందన, ముమైత్ ఖాన్ ఈ చిత్రంలో ఇతర కీలక పాత్రలను పోషించారు. 'నేను రెడీ' చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు.

## 27న వస్తోన్న సన్ ఆఫ్...




సాయి సింహాద్రి హీరోగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. బత్తుల సతీష్ దర్శకత్వం వహించారు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో గురువారం 'ఊసులాడే..' అనే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రచించిన ఈ గీతానికి రిషి ఎం సంగీతాన్నందించారు. ఆదిత్య, సమీర భరద్వాజ్ ఆలపించారు. ప్రేమబంధంలోని మధురానుభూతులకు అద్దం పట్టే గీతమిదని దర్శకుడు తెలిపారు. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగే ఈ కథలో చక్కటి సందేశం ఉంటుందని హీరో పేర్కొన్నారు. మీరారాజ్, వినోద్‌కుమార్, వాసు ఇంటూరి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: రిషి ఎం, రచన–దర్శకత్వం: బత్తుల సతీష్.

# తొందరేమీ లేదు.. అన్నింటికి మూల్యం తప్పదు

**- తన ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన అంబటి**



**గుంటూరు, ఫిబ్రవరి20( వెలుతురు):** తొందరేమీ లేదు.. అన్నింటికి మూల్యం చెల్లించుకునే సమయం వస్తుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పర్మిషన్ తీసుకునే నల్లపాడు వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లాను. టీడీపీ నేతలు కర్రలు, రాడ్లు తీసుకుని నా కారు మీదకు వచ్చారు. టీడీపీ నేతలు కట్టిన ఫ్లెక్సీని చించలేదు. ఇది మంచి సాంప్రదాయం కాదని చెప్పా. గూండాలు 4 గంటల పాటు బీభత్సం సృష్టిస్తే పోలీసులు ఏం చేశారని అంటూ ఆయన ప్రశ్నించారు. పోలీసులు, గూండాలు ఏకమై దారుణంగా ఇంటిపై దాడి చేశారు. ఆ మాట అనడాన్ని నా అంతరాత్మ ఒప్పుకోలేదు.. నేను బాధపడ్డాను. టీడీపీ నేతలు తిడుతున్నారనే ఉద్దేశంతో మాట అన్నాను. బ్యాచ్‌లుగా బ్యాచ్‌లుగా నా ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో నా పిల్లలు, నా మనవళ్లు ఉన్నారు. పోలీసులు సాక్షిగానే నా ఇంటి మీద దాడి చేశారు. నాలుగు గంటల పాటు నా ఇంటి మీద కరాళ నృత్యం చేశారు. పోలీసులు రక్షణ కల్పించలేక పారిపోండి అన్నారు. ఇదిలావుంటే అక్రమ కేసులో అరెస్ట్ అయ్యి.. బుధవారం బెయిల్‌పై విడుదలైన అంబటి రాంబాబు తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, టీడీపీ రౌడీ మూకలు తన ఇంటిని ధ్వంసం చేసిన తీరు, హత్యాయత్నం, పోలీసుల నిర్లిప్త వైఖరి, కొంతమంది పోలీసు అధికారుల అత్యుత్సాహం వంటి అంశాలను వైఎస్ జగన్‌కు వివరించారు. తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అధికార పార్టీకి ఒత్తాసు పలుకుతూ వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరును జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ భేటీలో అంబటితో పాటు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

# మండలిలో వైసిపి మహాపచారం

**- చెప్పులు, షూస్ వేసుకుని దేవుడి ఫోటోల ప్రదర్శన**

**- మండలి ఛైర్మన్ ఛాంబర్ ముందు కూటమి నేతల నిరసన**



**అమరావతి,ఫిబ్రవరి20( వెలుతురు):** ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యులు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫోటోలను ప్రదర్శించడాన్ని కూటమి సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఛైర్మన్ ఛాంబర్ వద్ద మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఎన్డీఏ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైకాపా చేసిన మహాపచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, రామానాయుడు, కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొన్నారు. హిందు మతాన్ని అవమానించారని ఛైర్మన్‌కు మంత్రులు తెలిపారు. ఇలాంటి చర్యను ఛైర్మన్ ఎలా అంగీకరిస్తారని నిలదీశారు. వైకాపా చేసింది తప్పేనని మండలి ఛైర్మన్ మోషేన్ రాజు స్పష్టం చేశారు. వైకాపా సభ్యులను పిలిచి మాట్లాడతానని ఛైర్మన్ తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పించి లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. చట్టసభ సాక్షిగా వైకాపా సభ్యులు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. హిందూ మతాన్ని రెచ్చగొట్టేలా వైకాపా ప్రవర్తించిందని మండిపడ్డారు. హద్దులు దాటి ప్రవర్తించి దేవదేవుడు పట్ల మహాపచారానికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు ఎంతో కలచివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగటం తగదన్నారు. సంయమనం పాటించే కొద్దీ రెచ్చగొడుతున్నారని.. హిందువుల పట్ల వైకాపా విధానం ఇదేనా అని నిలదీశారు. వెంకటేశ్వర స్వామి పట్ల తమ పార్టీ విధానం ఇదేనని జగన్ చెప్తున్నారా..? అని ప్రశ్నించారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. జగన్ డైరెక్షన్‌లోనే వైకాపా ఎమ్మెల్సీలు స్వామి వారిని తీవ్రంగా అవమానించారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. జనసేన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని నిర్లక్ష్యంగా విసిరేయడం తేలిగ్గా తీసుకునే విషయం కాదని ధ్వజమెత్తారు. జాతి క్షమించరాని నేరానికి వైకాపా సభ్యులు, జగన్ పాల్పడ్డారని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుయ్యబట్టారు. సభ వాయిదా పడగానే వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను ప్లకార్డులతో పాటు విసిరేసి వెళ్లారని ఆయన ఆరోపించారు. భారతజాతికి జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరస్వామి అంటే ఇంత చులకన భావమేంటని మండిపడ్డారు.

# శ్రీవారి లడ్డూ కల్తీని కప్పిపుచ్చే యత్నం

**- మండలిలో వైసిపి సభ్యుల సిగ్గుమాలిన చర్య**

**- తిరుమలేశుడి ఫోటోలతో డ్రామాలు దుర్మార్గం**

**- మండిపడ్డ తెలుగుదేశం ఎంపిలు**



**అమరావతి,ఫిబ్రవరి20( వెలుతురు):** శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంలో శాసనమండలిలో వైసీపీ నేతలు వేంకటేశ్వర స్వామి ఫొటోతో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ విషయంపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై తెలుగుదేశం ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు పట్టుకుని రాజకీయం చేస్తారా అని ధ్వజమెత్తారు. శాసనమండలిలో వైసీపీ తీరు సిగ్గు సిగ్గు అని ఎద్దేవా చేశారు. 'శ్రీవారి పవిత్ర లడ్డూలో కల్తీ జరిగిందని మాజీ టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి ఒప్పుకుంటే.. కల్తీ జరగలేదని వైసీపీ నేతలు కంత్రి వేషాలు వేస్తున్నారని దెప్పిపొడిచారు. క్రీడా స్ఫూర్తి చాటే లోకేశ్‌తో.. ప్యాలెస్‌లో పబ్జీ గేమ్ ఆడుకునే జగన్ రెడ్డికి పోలికా?' అని అప్పలనాయుడు సెటైర్లు గుప్పించారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరును సభ్య సమాజం వ్యతిరేకిస్తోందని టీడీపీ ఎంపీ సానా సతీశ్ పేర్కొన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు వేసుకుని ప్రదర్శిస్తున్న తీరు వైసీపీ నేతల మూర్ఖత్వానికి నిదర్శనని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. జగన్ ఆనందం కోసమే ఆ పార్టీనేతలు ఇలా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇలాంటి తప్పులు చేస్తూ వైసీపీ నేతలు కూడా పాపాలూ చేసే పరిస్థితి కొని తెచ్చుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎవరు చెప్పులు వేసుకుని రాలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని ఎంపీ సతీశ్ విమర్శించారు. సభ్య సమాజమంతా వైసీపీకి బుద్ధి చెప్పే సమయం వస్తుందని సానా సతీశ్ హెచ్చరించారు. లోకేశ్ క్రికెట్ చూడటానికి వెళ్తే జగన్‌కు వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. లోకేశ్‌ను చూసి జగన్ రెడ్డికి జలసీ, కుళ్లు అని ఎద్దేవా చేశారు. జగన్ ఎక్కడికైనా వెళ్లాలంటే కోర్టు పర్మిషన్ తీసుకుని వెళ్లాలని విమర్శించారు. టీవీలో క్రికెట్ చూడాలని జగన్‌కు రాసిపెట్టి ఉందని.. ఆయన నేరస్థుడు కాబట్టి బయటకు వెళ్లి క్రికెట్ చూడలేని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఇతర దేశాలకు వెళ్లాలంటే జగన్ రెడ్డి న్యాయస్థానం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. టీటీడీ లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికి హెరిటేజ్‌కు ముడిపెట్టారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కోను దేవుడు శిక్షిస్తారని.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 మంది సభ్యులు కూడా మిగలరని సానా సతీశ్ సెటైర్లు వేశారు. శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంపై టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పన్న ఎవరి పీఏనో అందరికీ తెలుసని, ఆయనకు సహాయం చేయమని జగన్‌మోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి గతంలో తనకు చెప్పారని అన్నారు. సహాయం చేసినందుకు ఆ నింద తనపై పడిందన్నారు. అప్పన్న ఎవరి పీఏనో దేశమంతా తెలుసునని ఎంపీ పేర్కొన్నారు.

# డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో తాత్సారం

**- ఎపి పోలీస్ అధికారుల తీరుపై మండిపడ్డ సుప్రీం**

**- నవంబర్ 18లోపు విచారణ పూర్తి చేయాలని ఆదేశం**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20( వెలుతురు):** వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో జరుగుతన్న జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సమగ్ర దర్యాప్తు చేస్తారా లేక..కేసును సిబిఐకి అప్పగించమంటారా అని నిలదీసింది. ఈ కేసులో దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఈకేసును విచారించింది. నవంబర్ 18లోపు విచారణ పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఆనాడు ఎమ్మెల్సీ అనంతబాబుతో పోలీసులు కుమ్మక్కయ్యారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. డిఫాల్ట్ బెయిల్ వచ్చేలోగా ఛార్జిషీట్ దాఖలు చేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అప్పట్లో తప్పుచేసిన పోలీసులపై ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం నిలదీసింది. కేసు ట్రయల్ కోసం హైకోర్టు సీనియర్ న్యాయాధికారిని నియమించాలని ఆదేశించింది. రోజువారీ విచారణ జరిగిలా చూడాలని పేర్కొంది. మార్చి 31లోపు ప్రత్యేక జ్యుడిషియల్ అధికారిని నియమించాలని హైకోర్టుకు సూచించింది. హైకోర్టు ఈ కేసులో జోక్యం చేసుకుని అడ్డంకులు సృష్టించవద్దని పేర్కొంది. నిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నట్లుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి దర్యాప్తు చేయడం రాకపోతే సీబీఐకి కేసును అప్పగించాల్సి వస్తుందని సీజేఐ హెచ్చరించారు.

# చెప్పలు, షూస్‌తో వెళ్లారు..చూడండి

**- అయితే సవాల్‌కు కట్టుబడి రాజీనామా చేయండి**

**- వైసిపి ఎమ్మెల్సీలకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి సవాల్**




**అమరావతి,ఫిబ్రవరి20( వెలుతురు):** ఏపీ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వేంకటేశ్వరుడి ఫొటోలు, ప్లకార్డులతో నిరసనకు దిగడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చెప్పులు, బూట్లతో దేవుడిని అవమానించారంటూ కూటమి సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో తాము సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫోటో, వీడియో చూపించినా ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానంటూ వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. ఈ ఛాలెంజ్‌పై వెంటనే స్పందించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి.. వైసీపీ సభ్యులు మండలిలో చెప్పులతో ఉన్న వీడియోను బయటపెట్టారు. ఎమ్మెల్సీగా రాజీనామా చేయాలని మాధవరావును మంత్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఫొటోలను.. ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గమని మండిపడ్డారు. స్వామి వారి ఫొటోను ఒకరు తలకిందులుగా పట్టుకున్నారని.. ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారని విమర్శించారు. దేనికోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. వికృత చేష్టలతో స్వామి వారిని అవమానించిన తీరు.. మనసును కలచివేసేలా ఉందన్నారు. దేవుడి పట్ల భయం – భక్తి లేకుండా ప్రవర్తిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. పాలు లేకుండా నెయ్యి తయారు చేసిన తమ నాయకుడికి సన్మానం చేయాల్సింది పోయి.. నిందిస్తారా అంటూ వైసీపీ నేతలు మైండ్ లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 5 కోట్ల మంది ప్రజలకు జగన్, వైసీపీ నేతలు క్షమాపణలు చెప్పి తీరాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి డిమాండ్ చేశారు.

# రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన రోజు

**- ఎక్స్ వేదికగా హరీష్ రావు పోస్ట్**

**హైదరాబాద్,ఫిబ్రవరి20( వెలుతురు):** రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది నేటికి 12 ఏళ్ల అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ చేశారు. బిల్ ఈజ్ పాస్డ్ అన్న టైటిల్‌తో ఓ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన క్రమాన్ని తన పోస్టులో ఆయన వెల్లడించారు. 2014, ఫిబ్రవరి 20వ తేదీన తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కినట్లు చెప్పారు. శాంతియుతంగా సాగిన స్వరాష్ట్ర ఉద్యమానికి సంకేత సూచకంగా బిల్లు పాసైనట్లు హరీశ్ రావు తన పోస్టులో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైనట్లు చెప్పారు. కేసీఆర్‌తో కలిసి విక్టరీ సంకేతం చేస్తున్న ఫోటోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కొన్ని దశాబ్దాల త్యాగం, పోరాటం, ఆత్మగౌరవం.. చివరకు కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు హరీశ్ తన ఎక్స్‌లో తెలిపారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అన్నారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

**విశాఖపట్టణం,ఫిబ్రవరి 20( వెలుతురు):** రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చీపురుపల్లి మండలం చొక్కారపాలెం గ్రామానికి చెందిన బొల్లు పైడిరాజు మృతి చెందాడు. రొయ్య పిల్లలను తీసుకురావడం కోసం బొల్లు పైడిరాజు (35) సరకు రవాణా వాహనంలో కాకినాడ జిల్లా వేమవరం వెళ్లారు. అక్కడ సరకు ఎక్కించుకొని తిరుగుముఖం పట్టారు.

శుక్రవారం వేకువజామున అనకాపల్లి జిల్లా నక్కపల్లి టోల్ ప్లాజా సమీపంలో వాహన టైర్లలో గాలిని చెక్ చేయడానికి ఆపారు. వాహన చోదకుడు పైడిరాజు గాలిని చెక్ చేస్తుండగా వెనక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్సులో నక్కపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆసుపత్రికి అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యంలో పైడిరాజు మృతి చెందాడు.

మృతునికి భార్య, ఓ కుమార్తె,ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇకపోతే పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగి శివారున కారు బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన బీరబోయిన వరప్రసాద్, భార్య సీతారత్నం దంపతులు మరో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి కారులో గురువారం అన్నవరంలో జరిగిన వివాహ వేడుకకు వెళ్లారు. తిరిగి వస్తుండగా శుక్రవారం ఉదయం జడ్డంగి శివారున కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సీతారత్నం (32) మృతిచెందగా మిగిలిన వారికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వారు జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

# భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ

**- బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20( వెలుతురు):** ఇండియాతో సంబంధాల పునరుద్ధరణ దిశగా తారిఖ్ రెహ్మాన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. దీంతో రెండు నెలలుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోని అన్ని వీసా సర్వీసులను త్వరలోనే పునరుద్ధరిస్తున్నట్టు సీనియర్ ఇండియన్ కాన్సులర్ అధికారి న్యూఢిల్లీలో గురువారంనాడు ప్రకటించారు. ఈ క్రమంలో భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది.

కొద్దికాలం క్రితం భారత వ్యతిరేక యువనేత షరీఫ్ ఒస్మాన్ హదీ హత్యకు గురికావడం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హదీ హత్యానంతరం హిందూ మైనారిటీలపై దాడులు, హత్యాకాండలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. గత డిసెంబర్ నుంచి భారత్-బంగ్లా మధ్య వీసా సర్వీసులు నిలిచిపోయాయి. అయితే యూనస్ తాత్కాలిక ప్రభుత్వం తప్పుకోవడం, ప్రజాస్వామ్యబద్ధంగా తారిఖ్ రెహ్మాన్ ఎన్నికకావడంతో భారత్-బంగ్లా మధ్య సంబంధాల పునరుద్ధరణకు సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి.

# గంజాయి కేసులో వైసీపీ ఎంపీటీసీ నగేశ్ బాబు అరెస్ట్

**కాకినాడ,ఫిబ్రవరి 20( వెలుతురు):** గంజాయి కేసులో వైసీపీ ఎంపీటీసీ నగేశ్ బాబుని కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం దాకమర్రికి చెందిన ఎంపీటీసీ చెల్లూరి నగేశ్‌బాబును అరెస్ట్ చేశారు. కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో అతను పరారీలో ఉన్నాడు. 20 కేజీల గంజాయిని కారులో తరలిస్తుండగా గతేడాది సెప్టెంబర్‌లో పోలీసులు పట్టుకున్నారు. అయితే ఈ కేసులో ఏ8గా ఎంపీటీసీ నగేశ్‌బాబు ఉన్నారు. ఆ తర్వాత అతను పరారయ్యాడు. ఈరోజు ఎట్టకేలకు అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు.



# ఫిరాయింపు ఎమమెల్సీలకు నోటీసులు

**అమరావతి,ఫిబ్రవరి 20( వెలుతురు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఫిరాయింపు ఎమ్మెల్సీలకు ఏపీ మండలి నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఫిరాయింపు ఎమ్మెల్సీలకు మండలి ఛైర్మన్ మోషేన్ రాజు నోటీసులు జారీ చేశారు. రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 25, 26న విచారణకు హాజరవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. ప్రలోభాలకు లోనై ఫిరాయించారనే వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు నేపథ్యంలో విచారణకు రావాలని మండలి ఛైర్మన్ నోటీసులు జారీ చేశారు. బల్లి కల్యాణ చక్రవర్తి, జయ మంగళ వెంకట రమణ, మర్రి రాజశేఖర్, పద్మ శ్రీ, సునీతలకు నోటీసులు జారీ అయ్యాయి. వీరంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు, కానీ రాజీనామాలు చేసి టీడీపీలో చేరారు. దీనిపై మండలి ఛైర్మన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేయగా, వారికి తాజాగా నోటీసులు జారీ చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com